ప్రశాంతంగా ఐసెట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహించిన ఐసెట్ ప్రశాంతంగా జరిగింది. బుధవారం పట్టణంలోని నలంద కళాశాలలో ఈ పరీక్ష రెండు సెషన్లలో కొనసాగింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో పరీక్ష జరిగింది. ఉదయం 9గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోగా విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించి లోనికి అనుమతించారు. అయితే ఉదయం సెషన్ 100 మంది విద్యార్థులకు 94 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 91 మంది విద్యార్థులకు 87 మంది విద్యార్థులు హాజరయ్యారని సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ పున్నారావ్ తెలిపారు. గురువారం కూడా పరీక్ష ఉంటుందని, మూడు సెషన్‌లలో పరీక్ష జరుగనుందని పేర్కొన్నారు. నిమిషం అలస్యం నిబంధన ఉన్నందున విద్యార్థులు త్వరగా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

నవతెలంగాణ 1
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | జూన్ 06, 2024 | www.navatelangana.com

గ్రీన్ ఛాంపియన్ అవార్డు అందుకున్న రిమ్స్ డైరెక్టర్

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్ రిమ్స్‌ను గ్రీన్ ఛాంపియన్ అవార్డు-2023 వరించింది. బుధవారం హైదరాబాద్‌లోని కాలుష్య నియంత్రణ కార్యాలయంలో డీఎంఈ వాణి చేతుల మీదుగా రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ గ్రీన్ ఛాంపియన్ అవార్డు అందుకున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ పొల్యూషన్ నియంత్రణ బోర్డు ప్రిన్సిపాల్ సెక్రెటరీ వాణి ఈ అవార్డును ప్రదానం చేశారు. దీంతో పలువురు డైరెక్టర్‌కు అభినందనలు తెలిపారు. ఆసుపత్రిలో పారిశుధ్యం, పచ్చదనం, బయో మెడికల్ వేస్టేజ్ మేనేజ్మెంట్(వైద్య వ్యర్థాల నిర్వహణ) పకడ్బందీగా నిర్వహిస్తుండటంతో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(టీజీపీసీబీ) ఈ అవార్డును ప్రకటించింది. బుధవారం తన పుట్టినరోజు నాడే ఈ అవార్డు తీసుకోవడం చాలా ఆనందంగా ఉందని డైరెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు.



సమన్వయలోపమే శాపమా..?

- కాంగ్రెస్ నాయకుల మధ్య కొరవడిన సఖ్యత
- విస్తృత ప్రచారం నిర్వహించిన మంత్రి సీతక్క
- అధికారం ఉన్నా..లోక్‌సభ స్థానంలో తప్పని ఓటమి
- తొలిసారి డిపాజిట్ కోల్పోయిన గులాబీ పార్టీ
- బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి మళ్లినట్లు ప్రచారం

రాష్ట్రంలో అధికారంలో ఉన్నా..నాయకుల మధ్య సమన్వయ లోపమే ఆ పార్టీకి శాపంగా మారిందా.. గెలిచే అవకాశం ఉన్న సీటును చేజేతులా జారవిడుచుకున్నారా..? అంటే సర్వత్రా అవుననే సమాధానం వినిపిస్తోంది. పార్టీలో ముఖ్య నేతల మధ్య సఖ్యత కొరవడటం.. క్షేత్రస్థాయి ప్రచారపర్వంలో పూర్తిస్థాయిలో భాగస్వామ్యం లేకపోవడం..ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి పూర్తిగా తీసుకెళ్లకపోవడం వంటి కారణాలు కాంగ్రెస్ ఓటమికి కారణమయ్యాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోపక్క గెలుస్తామనే ఆ పార్టీ నాయకుల అతి విశ్వాసం కూడా కొంప ముంచిందనే ప్రచారం జరుగుతోంది. మంత్రి సీతక్క ఇక్కడే మకాం వేసి నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్‌కు చెందిన కీలక నేతలు హస్తం పార్టీలో చేరినా ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదనే భావన వ్యక్తమవుతోంది. బీఆర్ఎస్ డిపాజిట్ కోల్పోవడం.. ఆ పార్టీకి చెందిన ఓటు బ్యాంకు బీజేపీకి మళ్లిందనే ప్రచారం జరుగుతోంది. ఇవే ఓట్లు కమలం పార్టీ విజయానికి దోహదం చేశాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అసెంబ్లీ ఎన్నికల్లో విజయదుందుభి మోగించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికలకు వచ్చే సరికి మిశ్రమ ఫలితాలను చవిచూసింది. పదేండ్ల బీఆర్ఎస్ పాలనకు అడ్డుకట్ట వేసి అధికారం సాధించిన హస్తం పార్టీ అనతికాలంలోనే ఓటమి మూటగట్టుకోవాల్సి వచ్చింది. ఉమ్మడి జిల్లాలో రెండు లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయగా.. పెద్దపల్లిలో విజయం సాధించింది. ఆదిలాబాద్ స్థానంలో మాత్రం పరాజయాన్ని చవిచూసింది. ఆదివాసీ ఉద్యమకారిణి, విశ్రాంత ఉపాధ్యాయురాలు ఆత్రం సుగుణకు టికెట్ కేటాయించింది. తొలిసారి మహిళకు టికెట్ ఇవ్వడంతో గెలుపు సులువు అవుతుందని ఆ పార్టీ భావించింది. అభ్యర్థి సుగుణ గెలుపును ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కొన్ని రోజుల పాటు ఇక్కడే ఉండి నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ శ్రేణులను ముందుకు నడిపించారు. ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ నిర్మల్‌లో బహిరంగ సభకు హాజరుకావడంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం మూడు సార్లు ఈ నియోజకవర్గానికి వచ్చి ప్రచారం నిర్వహించారు. ఓ దశలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని జనాల్లోనూ చర్చలు ప్రారంభమయ్యాయి. కానీ జనాన్ని పూర్తిస్థాయిలో తమవైపు తిప్పుకోవడంలో మాత్రం ఆ పార్టీ నాయకులు విఫలయ్యారనే అభిప్రాయం ఉంది. మరోపక్క కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించిన వామపక్షాలు,ఇతర ప్రజా, సామాజిక సంఘాలను సమన్వయం చేయడంలోనూ ఆ పార్టీ నేతలు విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి.

కొరవడిన సఖ్యత..!

ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉండగా కేవలం ఖానాపూర్‌లో మాత్రమే ఆ పార్టీకి ఎమ్మెల్యే ఉన్నారు. మిగితా చోట్ల నియోజకవర్గ ఇంఛార్జీలు ఉన్నారు. పార్టీ బలోపేతం కోసమే లక్ష్యంగా పలువురు బీఆర్ఎస్‌కు చెందిన కీలక నేతలను పార్టీలో చేర్చుకున్నారు. నిర్మల్‌లో మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ముధోల్‌లో మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, సిర్పూర్‌లో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప వంటి నేతలతో పాటు పలువురు ద్వితీయ స్థాయి నాయకులను సైతం పార్టీలో చేర్చుకున్నారు. కానీ కొందరు నియోజకవర్గ స్థాయి నేతలతో పాటు కొత్తగా పార్టీలో చేరిన వారి మధ్య సఖ్యత కొరవడటం..శ్రేణులను సైతం కలుపుకొని వెళ్లకపోవడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రచారం చేపట్టకపోవడం, గ్రూపుల మధ్య విభేదాలు, ఎండల ప్రభావం కారణంగా ప్రచార సమయంలో కొందరు కీలక నేతలు పూర్తిస్థాయిలో పర్యటించకపోవడం వంటి కారణాలు కాంగ్రెస్ అభ్యర్థి ఓటమికి కారణమయ్యాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి వెళ్లాయా..?

అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం రెండు సీట్లకే పరిమితమైన గులాబీ పార్టీ 4,65,476 ఓట్లను సాధించింది. మెజార్టీ ఎమ్మెల్యే స్థానాలు ఓడిపోయినా కాంగ్రెస్, బీజేపీల కంటే ఏకంగా 16వేల ఓట్లను అధికంగా పొందింది. కానీ తాజా లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం కేవలం 1,37,300ఓట్లకు మాత్రమే పరిమితమైంది. మిగితా ఓట్లు బీజేపీకి వెళ్లాయనే ప్రచారం జోరుగా సాగుతోంది.

కొందరు బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకులు పరోక్షంగా కమలం పార్టీకే ఓట్లు వేయించారనే ప్రచారం జరుగుతోంది. మరోపక్క బీజేపీకి ఇది సిట్టింగ్ స్థానం కావడంతో గెలుపును ఆ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ లోక్‌సభ పరిధిలో ఆ పార్టీకి నలుగురు ఎమ్మెల్యేలు ఉండటం.. హిందుత్వవాదం కూడా ఆ పార్టీ విజయానికి దోహదం చేసిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గులాబీ శ్రేణుల్లో గుబులు..!

- అసెంబ్లీ ఎన్నికల్లో భారీగా ఓట్లు సాధించిన బీఆర్ఎస్
- లోక్‌సభ ఫలితాల్లో మాత్రం డిపాజిట్ గల్లంతు
- ఐదు నెలల వ్యవధిలోనే భారీగా వ్యత్యాసం
- ఓట్ల వేటలో పుంజుకున్న బీజేపీ, కాంగ్రెస్

లోక్‌సభ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ శ్రేణులను కలవర పెడుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లు రాకపోయినా..గణనీయమైన ఓట్లు సాధించిన ఆ పార్టీ లోక్‌సభ ఎన్నికలు వచ్చే సరికి పూర్తిగా చతికిలపడటం ఆ పార్టీ శ్రేణుల్లో గుబులు పుట్టిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పార్టీకి పటిష్టమైన నాయకత్వంతో పాటు క్షేత్రస్థాయిలో గట్టి క్యాడర్ ఉన్నప్పటికీ ఫలితాలు ప్రతికూలంగా రావడం.. గతంలో ఎన్నడూలేని విధంగా డిపాజిట్ కోల్పోవడంతో ఆ పార్టీ నాయకులు, శ్రేణుల్లో గుబులు రేపుతోంది. కేవలం ఐదు నెలల వ్యవధిలోనే పార్టీ పరిస్థితి తారుమారు అయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో కేవలం కాంగ్రెస్, బీజేపీల మీదనే జనం దృష్టి కేంద్రీకృతమైందని.. బీఆర్ఎస్ పట్ల ఆసక్తి చూపించలేదనే వాదన వినిపిస్తోంది. గులాబీ పార్టీకి బలమైన క్యాడర్ ఉండటంతో విజయం సాధిస్తామని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేసినా చివరకు ప్రతికూల ఫలితాలు రావడంతో అసంతృప్తికి గురవుతున్నట్లు తెలుస్తోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అసెంబ్లీ ఎన్నికల వరకు జోరు మీదున్న కారు పార్టీ..లోక్‌సభ ఎన్నికలు వచ్చే సరికి పూర్తిగా చతికిలపడింది. ఉద్యమ కాలం నుంచి దశాబ్దం పాటు అధికారంలో ఉండి ఓ వెలుగువెలిగిన బీఆర్ఎస్ తాజాగా ఉనికే ప్రమాదంలో పడుతోంది. లోక్‌సభ ఫలితాల్లో పోలైన 12.21లక్షల ఓట్లకు గాను కేవలం 1,37,300 ఓట్లకే పరిమితం కావడం ఆ పార్టీ శ్రేణులను కలవర పరుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఈ లోక్‌సభ పరిధిలో ఏడింటిలో కేవలం రెండు సీట్లు మాత్రమే గెలిచినా ఓట్ల పరంగా మిగితా కాంగ్రెస్, బీజేపీ కంటే అధికంగా సాధించింది. లోక్‌సభ ఎన్నికలు వచ్చే సరికి పరిస్థితి తారుమారైంది. అప్పటి కంటే ఏకంగా 3.28లక్షల ఓట్లు తక్కువగా వచ్చాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ద్వితీయ స్థానం సాధించగా.. ఈ సారి మూడో స్థానానికి పరిమితమై డిపాజిట్ కోల్పోవడం ఆ పార్టీ పరిస్థితిని తెలియజేస్తోంది. ఓడలు బండ్లు.. బండ్లు ఓడలవుతాయనే నానుడి తాజా కారు పార్టీకి సరిపోతుంది. మరోపక్క ప్రచార సమయంలోనూ ఈ పార్టీకి చెందిన అగ్రనేతలు ఈ లోక్‌సభలో ప్రచారం నిర్వహించలేదు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మిగితా చోట్ల బస్సు యాత్ర చేపట్టినా.. ఈ నియోజకవర్గంలో మాత్రం పర్యటించకపోవడం కూడా ఆ పార్టీ శ్రేణులను తీవ్ర నిరాశకు గురిచేసింది.

పుంజుకున్న కాంగ్రెస్, బీజేపీ

అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే తాజా లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి అధికంగా ఓట్లు వచ్చాయి. ఇది వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ లోక్‌సభ పరిధిలో 4,65,476 ఓట్లను సాధించగా..కాంగ్రెస్ 2,52,286ఓట్లను బీజేపీ 4,48,961ఓట్లను సాధించింది. కానీ లోక్‌సభ ఎన్నికలకు వచ్చే సరికి బీఆర్ఎస్ ఓట్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోగా.. కాంగ్రెస్, బీజేపీలు గతం కంటే అధికంగా సాధించడం గమనార్హం. తాజా లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 1,37,300ఓట్లు రాగా.. కాంగ్రెస్ 4,77,516 ఓట్లను సాధించింది. ఈ రెండింటి కంటే బీజేపీ 5,68,168 ఓట్లను సాధించి 90,652 ఓట్ల మెజార్టీతో విజయం సాధించింది. మరోపక్క అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థులకు అసెంబ్లీలో వచ్చిన ఓట్ల కంటే లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం ఆయా నియోజకవర్గాల్లో అధికంగా ఓట్లు వచ్చాయి. కానీ కేవలం ఆసిఫాబాద్ నియోజకవర్గంలో మాత్రమే కాంగ్రెస్ బీజేపీ కంటే అధికంగా మెజార్టీ సాధించగా.. మిగితా ఆరు నియోజకవర్గాల్లో మాత్రం కాంగ్రెస్ కంటే బీజేపీకే అధికంగా ఓట్లు వచ్చాయి. ఇక బీఆర్ఎస్ ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 38,597ఓట్లు సాధించగా.. మిగితా ఆరింటిలో ఇంత కంటే తక్కువ ఓట్లను సాధించింది.

2024 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీల వారీగా వచ్చిన ఓట్ల వివరాలు

నియోజకవర్గం	బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ
సిర్పూర్	19840	62956	71325
ఆసిఫాబాద్	38597	73996	47056
ఖానాపూర్	18520	61587	75106
ఆదిలాబాద్	16265	77056	82394
బోథ్	22472	65204	70118
నిర్మల్	8264	64033	107603
ముధోల్	12505	67501	105334

2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల వారీగా వచ్చిన ఓట్ల వివరాలు

నియోజకవర్గం	బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ
సిర్పూర్	60614	8427	63,702
ఆసిఫాబాద్	83036	60238	6609
ఖానాపూర్	54168	58870	52398
ఆదిలాబాద్	60916	47724	67608
బోథ్	76792	32797	53994
నిర్మల్	55697	28642	106400
ముధోల్	74253	15588	98252

నీట్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యార్థుల ప్రభంజనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నీట్ ఫలితాలలో ఆదిలాబాద్ ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. వై. అశ్విన్ రెడ్డి, 580/720 రాథోడ్ అక్షయ 527/720, ధోతీ ఆదిత్య 493/720, ధోతీ అనీష్ 482/720, పొద్దటి అను 421/720, జాదవ్ అన్విక 418/720, బాల్నే సాత్విక 405/720 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రుల సమక్షంలో బుధవారం కళాశాల యాజమాన్యం పుష్పగుచ్ఛాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల డీజీఎం గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి లాంగ్‌టర్మ్ కోచింగ్ లేకుండా ప్రతి యేటా ఇంటర్ తరువాత పదుల సంఖ్యలో విద్యార్థులు నీట్, జేఈఈలకు అర్హత సాధించడం ఎస్ఆర్ జూనియర్ కళాశాలకే సాధ్యమని తెలిపారు. ఈ విజయానికి సహకరించిన కళాశాల లెక్చరర్స్‌ను, తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ వరదరెడ్డి డైరెక్టర్స్ సంతోష్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ కె.బ్రహ్మం, జైపాల్‌రెడ్డి, అరవింద్, పలువురు లెక్చరర్స్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-జైనథ్

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ హసీబుల్లా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ దేవాలయ పరిధిలో గ్రామ ప్రజలకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా ప్రజలు అత్యాశ, అమాయకత్వంతో సైబర్ నేరాలకు గురవుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ ప్రతి జిల్లాలో సైబర్ నేరాలను నియంత్రించేందుకు ప్రత్యేక అధికారులను నియమించిందన్నారు. మహిళలను ఎర చూపి వీడియో కాల్స్ ద్వారా బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు దోచుకుంటున్నారని, ఇలాంటి వాటిపై వ్యక్తిగతంగా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పిల్లలు, యువత ఆన్‌లైన యాప్‌ల ద్వారా లోన్లు తీసుకొని ఆ డబ్బులతో రమ్మీ గేమ్, ఇతర గేమ్స్ ఆడుతూ మోసపోతూ ప్రాణాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. పిల్లలు మోసపోకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రవర్తన, మొబైల్ ఉపయోగంపై పర్యవేక్షణ ఉండాలని సూచించారు. సైబర్ నేరగాని చేతిలో మోసపోయిన వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సిబిడి సాయినాథ్, ఎస్సై పురుషోత్తం, ఐటి కోర్ టీం కానిస్టేబుల్ రియాజ్ పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రామారావు పటేల్

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రానికి చెందిన బీజేపీ కార్యకర్త రాజశేఖర్ తండ్రి మాజీ సర్పంచ్ భూమన్న బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పూలమాలతో నివాళులు అర్పించి పాడే మోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ పరంగా కార్యకర్త కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట పాటు బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సైనిక్ స్కూల్‌లో సీటు సాధించిన విద్యార్థి

నవతెలంగాణ-ఇచ్చోడ



మండలం కేంద్రంలోని కృష్ణవేణి స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న రిషికేతన్ సైనిక్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్షలో సత్తా చాటాడు. వరంగల్ జిల్లాలోని సైనిక్ స్కూలుకు ఎంపిక కావడంతో తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు, కృష్ణవేణి స్కూల్ ప్రిన్సిపాల్ ధర్మన్న రిషికేతన్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ధర్మన్న మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పునాది లాంటిదని, ఈ చదువే భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి బి.హుస్సేన్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన పర్యావరణ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతలు ప్రతి ఒక్కరు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్‌రావ్ దేశ్‌పాండే, వైస్ ప్రెసిడెంట్ మోహన్‌రావ్, కార్యదర్శి అంగద్ కేంద్రే, న్యాయవాదులు ఆడేపు హరీష్, కుమ్మరి విజయ్, కోర్టు సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

9న జరిగే గ్రూప్-1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి





నవతెలంగాణ-నిర్మల్

ఈ నెల 9 న జరిగే గ్రూప్ -1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రూప్-1 పరీక్ష నిర్వహణపై పరిశీలకులు, చీఫ్ సూపరింటెండెంట్లు, రూట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలో గ్రూప్-1 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. టీజీపీఎస్సీ కమిషన్ నిబంధనలను అభ్యర్థులు, అధికారులు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. పరీక్ష రాయబోవు అభ్యర్థులకు, విధులు నిర్వహించే సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. అభ్యర్థులంతా తమ హాల్ టికెట్లపైన తాజా పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో అతికించాలని, కచ్చితంగా ప్రభుత్వం జారీ చేసిన ఏదైన గుర్తింపు కార్డును తమ వెంట తెచ్చుకోవాలని తెలిపారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, చేతి గడియారాలు, బూట్లు, సహా ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. ఉదయం పదిగంటలలోపు పరీక్ష కేంద్రాలలోకి చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతి లేదన్నారు. ఉదయం 10.30 నిమిషాల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందని, పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించిన తర్వాత పరీక్ష పూర్తయ్యేదాకా బయటకు వెళ్లడానికి అవకాశం లేదని తెలిపారు. పరీక్ష కేంద్రంలో సిబ్బందికి మొబైల్ ఫోన్లు అనుమతి లేదన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్ష నిర్వహిస్తామని, కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పరీక్ష పత్రాలు, సామాగ్రి తరలింపు సమయంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ప్రాంతీయ సమన్వయకర్త గంగారెడ్డి, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్లను ప్రలోభాలకు గురిచేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ అనేక రకాలుగా ఓటర్లను ప్రలోభాలకు గురి చేశాయని ఎంపీ గోడం నగేష్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తనపై ఎన్ని దుష్ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మలేదన్నారు. బీజేపీని, మోడీ నాయకత్వాన్ని బలపరిచేలా తీర్పు ఇచ్చారన్నారు. తన గెలుపుకు కార్యకర్తలతో పాటు జిల్లా, రాష్ట్ర, జాతీయ నాయకత్వం ఎంతో కృషి చేసిందన్నారు. అందరికీ పేరుపేరున ధన్యవాదలు తెలిపారు. రాజ్యాంగాన్ని రద్దు చేస్తారని, ఏజెన్సీ ప్రాంతాలను తీసేస్తారని అబద్ధపు మాటాలు ప్రచారం చేసినా పట్టం కట్టిన ప్రజలకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి వచ్చిన ప్రధాన మంత్రికి ప్రజలు ఆదిలాబాద్ సీటు గెలిపించి బహుమతిగా ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఆదిలాబాద్ స్థానం బీజేపీ కైవసం అయిందన్నారు. ఎర్రని ఎండను సైతం లెక్క చేయకుండా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రచారం చేశారన్నారు. కాంగ్రెస్ అధికారాన్ని దుర్వినియోగం చేసి డబ్బు, సారా, ప్రలోబలకు గురి చేసినా ప్రజలు బీజేపీకే మొగ్గు చూపారన్నారు. పార్లమెంట్ పరిధిలో నలుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ పంచపాండవుల్లాగా జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, నాయకులు అశోక్, ఆదినాథ్, మున్నా, మయూర్ చంద్ర, దినేష్, ఆకుల ప్రవీణ్, రాజేష్ ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | జూన్ 06, 2024 | www.navatelangana.com

ముగిసిన ఆర్మీ జవాన్ అంత్యక్రియలు

- చివరి చూపుకు తరలివచ్చిన జనం

నవతెలంగాణ-సిరికొండ



ఉత్తర్ ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో హవల్దర్‌గా మండల కేంద్రానికి చెందిన సూర్యవంశీ రాజేశ్వర్ విధులు నిర్వహిస్తూ అక్కడే మృతి చెందాడు. బుధవారం ఆయన మృతదేహాన్ని తీసుకువచ్చారు. పొన్న ఎక్స్ రోడ్ నుండి మండల కేంద్రానికి జవాన్‌కు ఘన నివాళులర్పిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించి అంతిమ యాత్ర చేపట్టారు. చివరి చూపు చూడడానికి జనాలు తరలి వచ్చారు. దుకాణ సముదాయాలు స్వచ్ఛందంగా మూసివేశారు. అంతిమ సంస్కారాలు ప్రభుత్వ లాంచనలతో నిర్వహించారు.

వేగవంతంగా కొనసాగుతున్న ప్రాజెక్టు పనులు

నవతెలంగాణ-కడెం



కడెం ప్రాజెక్టు మరమ్మత్తుల పనులు వేగవంతంగ కొనసాగుతున్నాయని ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విఠల్ అన్నారు. బుధవారం ప్రాజెక్టు మరమ్మత్తులను పర్యవేక్షించి మాట్లాడారు. ఈ జూన్ మాసంలో వర్షాలు పడనున్న నేపథ్యంలో ప్రాజెక్టు మరమ్మతుల పనులను వేగవంతంగ పూర్తి చేస్తున్నామన్నారు. ఏ విభాగం వారు ఆ విభాగంలో పనులు పూర్తి చేస్తున్నారని తెలిపారు. ప్రాజెక్టు క్వాలిటీ వింగ్ సైతం ప్రాజెక్టు పటిష్టతను పరిశీలిస్తున్నారన్నారు. త్వరితగతిన ప్రాజెక్టు మరమ్మత్తుల పనులు పూర్తవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈ బోజాదాస్, ఏఈఈ రవి నాయక్ పాల్గొన్నారు.

విత్తనాల కోసం పత్తి రైతుల పరేషాన్

- బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న డీలర్లు..?
- డిమాండ్ ఉన్న రకానికి అదనంగా డబ్బులు చెల్లించాల్సిందే..

నవతెలంగాణ-సిరికొండ



ఖరీఫ్ కాలంలో సాగులో రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలతో ఇబ్బందులు పెడుతుంటే మరోవైపు విత్తనాలు దొరక అష్టకష్టలు పడుతున్నారు. పత్తి సాగుకు జిల్లా పేరు పెట్టింది పేరు. ఈ ఖరీఫ్‌లో డిమాండ్ ఉన్న పత్తి విత్తనాలను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచకపోవడంతో 15 రోజుల క్రితం రైతులు ఆందోళన బాటరు. రంగంలోకి దిగిన కలెక్టర్, ఎస్పీలు పరిస్థితులు చక్కదిద్దారు. అయితే మళ్లీ కథ మొదటికి వచ్చినట్టు కనిపిస్తుంది. మండల కేంద్రంలో డిమాండ్ ఉన్న పత్తి రకానికి అధిక డబ్బులు చెల్లించాల్సిందే.

21 వేల ఎకరాల్లో 16 పత్తియే

సిరికొండ మండలంలో దాదాపు 21 వేల ఎకరాల సాగుభూమి ఉంది. అందులో ఈ ఖరీఫ్ సీజన్లో 16 వేల ఎకరాల్లో పత్తి పంటనే సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. డిమాండ్ రకం విత్తనాలతో ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఆ పత్తి ప్యాకెట్ ధర రూ.864 ఉంది. అయితే డీలర్లు అదనంగా రూ.600 నుంచి రూ.800 చెల్లించాలని, దాంతో పాటు ఇతర కంపెనీకి చెందిన రెండు పత్తి విత్తన ప్యాకెట్లను తీసుకోవాలని సూచిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే రైతుకు ఇచ్చే రసీదులో మాత్రం రూ.864 చొప్పున చెల్లించినట్లు బిల్లులు ఇవ్వడం గమనార్హం.

అధిక ధరలకు విక్రయాలు..?

డిమాండ్ ఉన్న పత్తి విత్తనాల రకం కోసం డీలర్ల వద్దకు వెళితే అసలు కంటే ఎక్కువ డబ్బులు అడుగుతున్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయించవద్దనే నిబంధనలున్న వాటిని డీలర్లు పాటించడం లేదు. అంతే కాకుండా ఆ డిమాండ్ రకం విత్తనాలు కొనుగోలు చేయాలంటే ఇతర కంపెనీలకు చెందిన వాటిని తీసుకోవాలని చెబుతున్నారు. ఆ విత్తనాలు తీసుకోకుంటే ఇచ్చేది లేదంటున్నారు డీలర్లు. ఈ విషయమంత అధికారుల ముందు జరిగిన కూడా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

డీలర్లతో అధికారులు కుమక్కు..?

రైతుల ఆందోళన నేపథ్యంలో కలెక్టర్ రాజర్షి షా విత్తనాల దుకాణాల్లో మండల స్థాయి వ్యవసాయ శాఖ అధికారులను విత్తన, ఎరువల దుకాణాల వద్ద విధులు వేశారు. రైతులు, డీలర్లకు మధ్య వారధిగా ఉండాలనే ఆలోచనతో కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. డిమాండ్ ఉన్న రకంతో ఇతర రకం విత్తనాలు డీలర్లు అంటగుడుతున్న, అధిక ధరలు తీసుకుంటున్న అక్కడే ఉన్న అధికారి మాత్రం పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారే ఆరోపణలు గట్టిగా ఉన్నాయి. అధికారి దుకాణంలో ఉన్న సమయంలోనే డీలరు దర్జాగా ఇతర కంపెనీల విత్తనాలు ఇస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే అధికారులు డీలర్లతో మమేకం అయినట్లు తెలుస్తుందని మండల రైతులు ఆరోపిస్తున్నారు.

కొతర సృష్టిస్తున్నారా...?

డిమాండ్ రకం విత్తనాలు మార్కెట్‌లో దొరకకపోవడంతో డిమాండ్ లేని విత్తనాలను రైతులకు అంటగడుతున్నారనే ఆరోపణలున్నాయి. పత్తి విత్తనాలను డీలర్లు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తు కొరత సృష్టిస్తున్నారు. ఆదివాసీ గ్రామాల్లో దళారులు ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని నకిలీ విత్తనాలను అంటగట్టినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రైతులు దుక్కులు దున్ని భూములను సిద్ధం చేసుకుని అనుకూలమైన వర్షం పడగానే విత్తనాలు విత్తెందుకు సిద్ధమవుతున్న సమయంలో రైతులకు నకిలి విత్తనాల బెడదతో పాటు కోరుకున్న విత్తనాలు లభించకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించి నకిలీ విత్తనాల కట్టడి చేయాలని రైతులు కోరుతున్నారు.

కొరత విషయం మా దృష్టికి రాలేదు

జాదవ్ కైలాస్, ఇన్‌చార్జి మండల వ్యవసాయ అధికారి



విత్తనాల కొరత సృష్టిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. రైతులు కూడా ఫిర్యాదు చేయలేదు. మార్కెట్ ధర కంటే అధిక ధరకు విక్రయించిన, లింకు పేరుతో రైతులను ఇబ్బందికు గురి చేసిన కఠిన చర్యలు తీసుకుంటాం. ఎలాంటి ఇబ్బందులున్న రైతులు తమను సంప్రదించాలి.

నీరు రావడం లేదని రోడ్డుపై నిరసన



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని మలంగి తండా గ్రామంలో పది రోజుల నుండి నీరు రావడం లేదని గ్రామస్తులు బుధవారం ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసనకు దిగారు. గ్రామంలో 130 ఇండ్లకు మూడు బోర్లు ఉన్న ఎండాకాలం కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోయి నీరు రావడంలేదని, భగీరథ నీరు సరఫరా కావడం లేదన్నారు. నీటి ఎద్దడిపై దృష్టి పెట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇంటి పన్ను డబ్బులు కట్టిన తమకు రశీదు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఇప్పటి కైన పై అదికారులు వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇదే విషయమై గ్రామ కార్యదర్శిని వివరణ కోరగా గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ లేని కారణంగా సమస్య వస్తుందని, ట్యాక్స్ రసీదులు అందుబాటులో లేవని ఈ విషయాలను పై అధికారులకు తెలియజేయడం జరిగిందన్నారు. త్వరలోనే సమస్యకు పరిష్కరం చూపుతామన్నారు. నిరసనలో దివ్య శ్రీ ఫౌండేషన్ చైర్మన్ ప్రవీణ్ నాయక్, గణేష్, సంగీత, యశోద బాయి, రూపాబాయి, కౌసల్య, సునీత ఉన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

- ఏఓ రాథోడ్ గణేష్



నవతెలంగాణ-ఉట్నూర్

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు అన్ని ఏఓ గణేష్ అన్నారు. మండలంలోని పేర్కగూడ గ్రామంలో డీసీఎంఎస్ఎఫ్‌సీ విత్తనాల దుకాణాలను బుధవారం మండల వ్యవసాయ అధికారి సందర్శించారు. స్టాక్‌ను రిజిస్టర్‌లో రాసి ఉంచాలని, స్టాక్ వివరాలను తెలియజేసేల బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎంఆర్‌పీకి కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు విత్తనాలతో పాటు రసీదును కూడా తీసుకోవాలన్నారు.

ఎంపీకి అభినందనల వెల్లువ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీగా గెలుపొందిన గోడం నగేష్‌కు అభినందనలు వెలువెత్తాయి. బుధవారం ఆయన నివాసంలో పట్టణ ప్రముఖులు, ఆయా సంఘాలు, బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువతో సత్కరించి పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు. అదే విధంగా ఆయా మండలాల పార్టీ నాయకులు, మహిళ విభాగం నాయకురాళ్లు ఎంపీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తన విజయానికి కషి చేసిన కార్యకర్తలకు ఈ సందర్భంగా ధన్యవాదలు తెలిపారు. ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి పలువురుతో కలిసి పూలబొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గెడం మాధవ్, హనుమాండ్లు యాదవ్, ఉరాడే శుభాష్, ఎముల ఆశన్న ఉన్నారు.

భద్రత బలగాలతో ఎన్నికలు విజయవంతం

- అదనపు ఎస్పీ సురేందర్ రావు
- సీఆర్పీఎఫ్‌కు ఘన వీడ్కోలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

క్రమశిక్షణ సమయపాలనకు మారుపేరు సీఆర్పిఎఫ్ బలగాలని, వారి భద్రతతో ఎన్నికలు విజయవంతం అయ్యాయని అదనపు ఎస్పి బి సురేందర్ రావు అన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుండి వచ్చిన బలగాలకు బుధవారం పట్టణంలోని వైటీసీ కేంద్రంలో సీఆర్పీఎఫ్ సిబ్బందికి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. దీనికి అదనపు ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్ట్రాంగ్ రూమ్ విధులను క్రమశిక్షణతో ఎటువంటి లోపాలు జరగకుండా 24 గంటలు అప్రమత్తలతో విధులను నిర్వర్తించిన సిఆర్పిఎఫ్ సిబ్బందిని ఎస్పీ ఆదేశాల మేరకు సత్కారించారు. ముందుగా పూలమాల శాలువాలతో సన్మానించి సిబ్బందికి బహుమతులు ప్రధానం చేసి సాధారణంగా సాగనంపినట్లు తెలిపారు. సీఆర్పీఎఫ్ సిబ్బంది స్ట్రాంగ్ రూమ్ విధులను ఎండనక, వాననక నిరంతరం ఆకస్మిక తనిఖీలు నిర్వహించినప్పుడు అప్రమత్తంగా ఉంటూ విధులను నిర్వర్తించారన్నారు. పట్టణం, జిల్లాలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తూ ప్రజలలో మేమున్నామంటూ భరోసా కల్పించేలా సహకారం అందించారన్నారు. సిబ్బంది ప్రతి ఒక్కరికి పూలమాల శాలువాతో సత్కరించి మిఠాయిలు తినిపించి బహుమతులు అందించి వాహనం వరకు సాగనంపారు. ఇందులో డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్ సీఐలు కే సత్యనారాయణ, ఏ అశోక్, కె ఫణిధర్, మావల ఎస్ఐ విష్ణువర్ధన్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుపై అవగాహన



నవతెలంగాణ-లోకేశ్వరం

ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులకు వ్యవసాయ విస్తరణ అధికారి ఉమేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విత్తనాలు కొనుగోలు చేసినంతరం రసీదును తీసుకోనీ పంట అయిపోయేంత వరకు భద్రపరచుకోవాలని రసీదుపై లాట్ నెంబర్ గడువు కాలం సరి చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కళాశాలల సమస్యలు పరిష్కరించాలి

- డీఐఈఓకు ఏఐఎస్ఎఫ్ వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కళాశాలల సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి గెడం కేశవ్ అన్నారు. బుధవారం జిల్లా ఇంటర్ బోర్డు అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేశవ్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రయివేట్, కార్పోరేట్ విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రించాలని, అనుమతి లేని కళాశాలల జాబితా విడుదల చేయాలన్నారు. ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులు భర్తీ చేసే విధంగా చర్యలు చేపట్టి, ప్రయివేట్, కార్పోరేట్ కళాశాలల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించాలన్నారు. ప్రభుత్వ అనుమతి లేని కళాశాలల జాబితాను బహిర్గతం చేసి, ఇంటర్ నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మెస్రం ప్రవీణ్, గెడం మాణిక్, నరేందర్ పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయాలి


- డీఈఓకు అభ్యర్థుల వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



దాదాపు 8 సంవత్సరాల తర్వాత గ్రూప్-2, డీఎస్సీ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో డీఎస్సీ పరీక్షను వాయిదా వేయ్యాలని అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం ఆదిలాబాద్ డీఈఓ ప్రణీతను ఆమె కార్యాలయంలో డీఎస్సీ అభ్యర్థులు కలిసి వినతిపత్రం అందజేసి తమ గోడును విన్నవించుకున్నారు. వారం రోజుల వ్యవధిలోనే డీఎస్సీ, గ్రూప్-2 పరీక్షలు ఉన్న నేపథ్యంలో సిలబస్ పూర్తి కావడం కష్టతరంగా ఉంటుందని పేర్కొన్నారు. డీఎస్సీ పరీక్షను వాయిదా వేసి ఆగస్టు తర్వాత నిర్వహించాలని అభ్యర్థులు కోరారు. అలాగే జిల్లాలో పోస్టుల సంఖ్యను పెంచేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని కోరారు. గత నోటిఫికేషన్‌లో పోస్టులు పెంచినప్పటికి ఆదిలాబాద్‌కు కేటాయించలేదని వాపోయారు. తమ సమస్యలు పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని కోరారు.

పరిశుభ్రతను పాటించాలి : ఈఓ శంకర్



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రతి ఇంట్లో పరిశుభ్రతను పాటించాలని గ్రామపంచాయతీ ఈఓ శంకర్ అన్నారు. బుధవారం గ్రామపంచాయతీ సిబ్బంది పాత ఉట్నూర్‌లో మురికి కాలువలను శుభ్రం చేయగా ఆయన పరిశీలించారు. గ్రామపంచాయతీ పరిధిలో కాలనీల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా ముందుగానే పిచ్చి మొక్కలను తొలగిస్తున్నామన్నారు.

కేటీఆర్ సిరిచెల్మ డిప్యూటీ రేంజ్ అధికారిగా గీరయ్య

నవతెలంగాణ-ఇచ్చోడ

కవ్వాల టైగర్ రిజార్వ్(కేటీఆర్) ఫారెస్ట్ రేంజ్ సిరిచేల్మా డిప్యూటీ రేంజ్ అటవీ శాఖాధికారిగా గీరయ్య బుధవారం పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన అమర్ సింగ్ సెలువుపై వెళ్లడంతో గీరయ్య బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ సంపాదన కాపాడే బాధ్యత అందరిపై ఉందన్నారు. కలప, ఇసుక అక్రమ రవాణా, నిల్వ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక, కలప రవాణా, నిల్వ గురించి ఎవరైనా సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

నేడు 'మీ ఎమ్మెల్యేతో' ఫోన్ ఇన్

నవతెలంగాణ-ఉట్నూర్

ఖానాపూర్ నియోజకవర్గంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రజలతో నేరుగా మాట్లాడేందుకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఫోన్ ఇన్ కార్యక్రమం చేపడుతున్నారు. గ్రామాల్లోని సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకోరావచ్చు. గురువారం ఉదయం 7:30 నుంచి 8:30 గంటల వరకు ఫోన్ ఇన్ కార్యక్రమం ఉంటుంది. 8790157229 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయాలని ఎమ్మెల్యే కోరారు.

గోదాంలో భద్రపరిచిన అసెంబ్లీ ఈవిఏంలు



ఆదిలాబాద్‌టౌన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం- 2023 సాధారణ ఎన్నికల్లో పోటీ చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్న తెలంగాణ హై కోర్టులో ఎన్నికల పిటిషన్ ద్వారా తన ప్రత్యర్థి అయిన పాయల్ శంకర్ అఫిడవిట్ పై కేసు నమోదు చేశారు. మే 3న ఈ కేసులో ఈవీఏంలపైన ఎలాంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేనందున ఈవీఎంలను రిలీజ్ చేసుకోవచ్చని కోర్టు తెలిపింది. ఈ సందర్భంగా బుధవారం స్థానిక టీటీడీసీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ నుండి శాంతినగర్ ఈవీఏం గోదాంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు, అభ్యర్థులు, అధికారుల సమక్షంలో భద్రపరచడం జరిగిందని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, ఆర్డీఓ వినోద్ కుమార్, రాజకీయ పార్టీ ప్రతినిధులు, అభ్యర్థులు ఉన్నారు.

నిర్మల్ : కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంను బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆయా రాజకీయ పార్టీల నాయకులతో కలిసి పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయినందున, ఎన్నికల్లో ఉపయోగించిన ఈవీఎంలను గోదాంలో భద్రపరిచి సీలు వేశారు. కార్యక్రమంలో ముధోల్ ఆర్డీఓ కోమల్‌రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు కొరిపెల్లి శ్రావణ్ రెడ్డి, సయ్యద్ అజర్, గంద్రత్ రమేష్ పాల్గొన్నారు.



నిర్మల్

జూన్ 8న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మృగశిర కార్తెను పురస్కరించుకొని జూన్ 8న నక్షత్రవేద కాలంలో ఆదిలాబాద్ పట్టణంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్య ఆయుర్వేదిక్ రీసెర్చ్ సెంటర్ డాక్టర్ యువరాజ్ వైద్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని సీసీఐ ఎక్స్ రోడ్ వద్ద గల్ల వైద్య ఆయుర్వేదిక్ రీసెర్చ్ సెంటర్‌లో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఉబ్బస వ్యాధి గ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. జూన్ 7లోపు 08732-227340, 94402 47332 నంబర్లను సంప్రదించి ముందస్తుగా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | జూన్ 06, 2024 | www.navatelangana.com

డ్రైనేజీలలో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయొద్దు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీలలో ప్లాస్టిక్ వ్యర్థాలు పడేయకుండా ప్రజలు జాగ్రత్త వహించాలని మున్సిపల్ కమిషనర్ భుజంగరావు అన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ భుజంగరావు మాట్లాడుతూ వర్షాకాలంలో డ్రైనేజీలలో ప్లాస్టిక్ వ్యర్థాలు పడేయడం వల్ల ఎక్కడికక్కడ నీటి నిల్వ ఉంటుందన్నారు. దోమలు వ్యాప్తి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇండ్లలకు చెత్త ట్రాక్టర్లలో వేయాలని సూచించారు. ప్రజలు సహకరించినప్పుడే పట్టణ పరిశుభ్రత సాధ్యమవుతుందని తెలిపారు.

అంబేద్కర్ విగ్రహా ప్రతిష్టాపనకు ఆహ్వానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని బూరుగుడ గ్రామంలో ఈనెల 9న నిర్వహించే అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపనకు కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌కు నిర్వహణ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన ఆశయాలు కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందన్నారు. గ్రామంలో ఆయన విగ్రహం పెట్టడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అనిల్ గౌడ్, మేకర్తి శ్రీనివాస్, ధర్మయ్య, ఆనంద్ రావు, లోహజీ పాల్గొన్నారు.

నోటాతో పోటీ పడలేకపోయిన స్వతంత్రులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సార్వత్రిక ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో విచిత్రమైన పరిస్థితి చోటుచేసుకుంది. బరిలో ఉన్న అభ్యర్థులు నచ్చని పక్షంలో నోటా (పైవారు ఎవరూ కాదు) అనే ఐచ్ఛికంతో ఈవీఎంలు తయారు చేశారు. అయితే పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో పన్నెండు మంది అభ్యర్థులు పోటీ పడగా ప్రధాన పార్టీలకు మాత్రమే చెప్పుకోదగ్గ ఓట్లు రాగా స్వతంత్ర అభ్యర్థులు ఎవరు కూడా నోటాతో పోటీ పడలేకపోయారు. పార్లమెంటు పరిధిలోని 10 నియోజకవర్గాల్లో కలిపి స్వతంత్ర అభ్యర్థులు జంగు బాపుకు 6764, కొడప వామన్ రావుకు 1685, మేస్త్రం గంగాదేవికి 3468, గెడం సాగర్‌కు 1565, చవాన్ సుదర్శన్‌కు 4644, తిరుపతికి 2292, శ్యామ్‌లాల్ నాయక్‌కు 7499, జయవంతరావుకు 6446, రాథోడ్ సుభాష్‌కు 6528 ఓట్లు రాగా నోటాకు 11762 ఓట్లు వచ్చాయి. ఏడు మంది స్వతంత్ర అభ్యర్థుల కంటే కూడా నోటాకే ఎక్కువ ఓట్లు రావడం చర్చనీయాంశంగా మారింది.

విద్యుత్ పునరుద్ధరించాలని గ్రామస్తుల నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని పాడిబండ గ్రామపంచాయతీ పరిధిలో 11 గ్రామాలకు నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు బుధవారం రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభాలు విరగడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని, దీనితో 11 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. విద్యుత్ లేకపోవడంతో రాత్రిపూట తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో చిర్రకుంట నుంచి దాంపూర్ వరకు 11 కేవీ విద్యుత్ మంజూరు చేసినప్పటికీ పూర్తి చేయలేదని దీనితో ఇబ్బందులు మరింత పెరిగాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ పునరుద్ధరించాలని లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ సేన ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు సీడం కైలాష్, గ్రామస్తులు కుమురం లక్ష్మి, తోడసం భాగ్యలక్ష్మి, పూసం రమ్య, దుర్వా రేణుక, సిడాం జంగుబాయి, దుర్వ యమునా, సోయం లక్ష్మి, సీడం మణిక్ రావు, గోడం కాంతారావు, నైతం రాజు, దుర్వ సక్కు, సీడం సాగర్ పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీకి మరమ్మత్తులు చేయండి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని పాటగూడ వంతెనపై మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కారణంగా నీరు ఎగిసిపడుతుంది. దీంతో నీరంతా ప్రక్కనున్న వాగులో చేరుతుంది. మిషన్ భగీరథ నీరు వృథాగా పోతుండడంతో నీరు అందడంలేదని పేర్కొన్నారు. సంబంధిత శాఖ అధికారులు మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మత్తులు చేసి తాగునీటిని అందించాలనీ గ్రామస్తులు కోరుతున్నారు. వేసవిలో తాగు నీరు లేక కష్టాలు పడుతున్నారన్నారు. కానీ ఇక్కడ నీరు వృథాగా పోతున్న పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

బీజేపీ విజయంలో కాందిశీకులదే కీలకపాత్ర

- నాడు అసెంబ్లీ, నేడు లోక్‌సభ ఎన్నికల్లో అవే ఫలితాలు

వారంతా బెంగాళీలు. 1964లో తూర్పు పాకిస్తాన్ నుండి బంగ్లాదేశ్ విడిపోయిన సమయంలో అక్కడి నుండి వలస వచ్చిన బెంగాళీలకు ఇక్కడ ఆశ్రయం కల్పించారు. 1964తో పాటు 1976లో రెండు పర్యాయాలు వీరు ఇక్కడికి వలస వచ్చారు. కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌నగర్‌లోని 13 క్యాంప్‌లతో పాటు చింతలమానేపల్లి మండలం రవీంద్రనగర్‌లో రెండు క్యాంప్‌లలో వీరు నివాసముంటున్నారు. వీరు సాధారణంగా బీజేపీ వైపే మొగ్గు చూపుతారు.



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం నజ్రుల్‌నగర్‌లోని 13 క్యాంపులలో బెంగాళీలు నివసిస్తున్నారు. ప్రస్తుతం జరిగిన లోక్‌సభ ఎన్నికలలో వీరు బీజేపీకి పట్టం కట్టారు. కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాంలో నాలుగు పోలింగ్ కేంద్రాలుండగా, నజ్రుల్‌నగర్‌లో 12 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఈజ్‌గాంలోని నాలుగు పోలింగ్ కేంద్రాల పరిధిలో 3,197 మంది ఓటర్లు ఉండగా 2,362 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో 1969 మంది బీజేపీకి ఓట్లు వేయగా, 272 మంది కాంగ్రెస్‌కు, 64 మంది బీఆర్‌ఎస్‌కు ఓటేశారు. అంటే 83 శాతం మంది బీజేపీకే పట్టం కట్టారు. ఇక నజ్రుల్‌నగర్ పరిధిలో 12 పోలింగ్ కేంద్రాలు ఉండగా 11,004 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 7,926 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో బీజేపీకి 7,428 మంది ఓటేశారు. కాంగ్రెస్‌కు 313, బీఆర్‌ఎస్‌కు 71 ఓట్లు వచ్చాయి. పోలైన ఓట్లలో 93 శాతం మంది బీజేపీకే ఓటేశారు. చింతలమానేపల్లి మండలం రవీంద్రనగర్‌లో రెండు బెంగాళీ క్యాంపులు ఉండగా అక్కడ రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల పరిధిలో 2,513 మంది ఓటర్లుండగా, 1940 మంది ఓట్లేశారు. ఇందులో బీజేపీకి 1789 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 102, బీఆర్‌ఎస్‌కు 20 ఓట్లు వచ్చాయి. ఈ గణాంకాలు చూస్తే బెంగాళీలు బీజేపీకే మొగ్గు చూపుతారనేది స్పష్టంగా అర్థమవుతోంది. దీనితోనే మొదటి ఐదు రౌండ్లు పూర్తయ్యేసరికే బీజేపీకి 10 వేల ఓట్ల ఆధిక్యత లభించింది. ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కూడా వీరు బీజేపీ అభ్యర్థికే అధిక శాతంలో ఓట్లేశారనేది గణాంకాల బట్టి తెలుస్తోంది.

3 మండలాల్లో బీజేపీ, 4 మండలాలు, 1 బల్దియాలో కాంగ్రెస్

లోక్‌సభ ఎన్నికల ఫలితాలు సిర్పూరు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారాయి. బీఆర్‌ఎస్ పెద్దగా ప్రభావం చూపకపోయినా, కాంగ్రెస్, బీజేపీలు ఆధిక్యత కోసం ముమ్మర ప్రచారం చేపట్టాయి. అన్ని మండలాలలో తామంటే తామే ఆధిక్యత కనబరుస్తామని ధీమా వ్యక్తం చేసిన ఈ రెండు పార్టీలకు ఓటర్లు గట్టి షాకే ఇచ్చారు. బీజేపీకి కాగజ్‌నగర్ మండలంతో పాటు చింతలమానేపల్లి, దహెగాం మండలాలలో ఆధిక్యత రాగా, కాంగ్రెస్‌కు కాగజ్‌నగర్ టౌన్‌తో పాటు సిర్పూరు, కౌటాల, బెజ్జూరు, పెంచికల్‌పేట్ మండలాలలో ఆధిక్యత వచ్చింది. కాంగ్రెస్‌కు సిర్పూరులో 205, బెజ్జూరులో 344, పెంచికల్‌పేట్‌లో 919, కౌటాలలో 1461 ఓట్ల ఆధిక్యత లభించగా, బీజేపీకి కాగజ్‌నగర్ మండలంలో 8,582, చింతలమానెపల్లిలో 1,617, దహెగాం మండలంలో 2,494 ఓట్ల ఆధిక్యత లభించింది.

రెండు ఈవీఎంల లెక్కింపు నిలిపివేతపై సందిగ్ధం

సిర్పూరు నియోజకవర్గానికి చెందిన రెండు ఈవీఎంలను మంగళవారం లెక్కించలేదు. వీటిని ఎందుకు లెక్కించలేదనే విషయంలో స్పష్టమైన వివరణ లేదు. కాగజ్‌నగర్ మండలం మోసం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం (నెం.26/ఎ)లో 429 మంది ఓటర్లుండగా 347 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీనిని మంగళవారం అధికారులు లెక్కించలేదు. అదేవిధంగా సిర్పూరు (టి) మండలం చింతకుంటలోని పోలింగ్ కేంద్రం (నెం.137)లో 809 మంది ఓటర్లుండగా, 656 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీనిని కూడా అధికారులు లెక్కించలేదు.

సిర్పూరు నియోజకవర్గంలో మండలాల వారీగా పార్టీలకు వచ్చిన ఓట్ల వివరాలు

మండలం	మొత్తం ఓట్లు	పోలైనవి	బీజేపీ	కాంగ్రెస్	బీఆర్ఎస్
కాగజ్‌నగర్	44,218	33,760	18,944	10,362	2,656
కాగజ్‌నగర్ టౌన్	50,341	28,043	12,205	13,600	1,957
సిర్పూరు (టి)	21,901	16,734	6,525	6,730	2,027
కౌటాల	26,989	19,904	7,557	9,018	2,137
చింతలమానెపల్లి	23,394	17,775	7,752	6,135	2,670
బెజ్జూరు	23,884	17,296	6,047	6,391	3,507
పెంచికల్‌పేట్	12,296	9,865	3,360	4,279	1,637
దహెగాం	26,078	20,253	8,935	6,441	3,249

దుకాణాలు, ట్రాన్స్‌పోర్టుల తనిఖీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ఎరువులు, విత్తనాల దుకాణాలతో పాటు ట్రాన్స్‌పోర్టులను ఏడీఏ మనోహర్, టౌన్ సీఐ శంకరయ్య, ఏఓ రామకృష్ణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనుమానం ఉన్న వస్తువులు, బాక్సులు, లూజ్ విత్తనాలు, నకిలీ విత్తనాలు ట్రాన్స్‌పోర్టుకు వస్తే సమాచారం అందించాలన్నారు. షాపుల్లో నిల్వలు, రిజిష్టర్లు పరిశీలించారు. నిషేధిత, అనుమతి లేని విత్తనాలు, ఎరువులు అమ్మవద్దని, నిబంధనలు ఉల్లంఘించినా, కాలం చెల్లిన పురుగుల మందులు, ఎరువులు విక్రయించినా లైసెన్స్ రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాల్లో ఉన్న విత్తనాలు, ఎరువుల నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులు విత్తనాల కొనుగోలు రశీదులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని తెలిపారు. డీలర్లు రైతులను మోసం చేయడానికి యత్నించిన, నకిలి విత్తనాలు విక్రయించిన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.



విత్తనాల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

జీపీ కార్మికులకు జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-రెబ్బెన

గ్రామపంచాయతీ కార్మికులందరికీ జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించడంతో పాటు మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందించారు. గ్రామపంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శిగా నియమించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించి కార్మికులకు అండగా ఉండాలని మంత్రిని విన్నవించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసఫ్, జీపీడబ్ల్యూయూ రాష్ట్ర అధ్యక్షులు నర్సింహారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జయచంద్ర, ప్రధాన కార్యదర్శి బి.వెంకట రాజ్యం ఏఐటీయూసీ కుమురం భీం జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, జీపీడబ్ల్యూయూ ఆర్ఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య, జిల్లా కమిటీ సభ్యులు రవి పాల్గొన్నారు.

ఆర్ఎల్‌సీ కూతురికి నీట్ ర్యాంక్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మైనార్టీ సంక్షేమ శాఖలో ఉమ్మడి జిల్లా రీజనల్ లెవల్ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న జిల్లాకు చెందిన గుల్బం శ్రీధర్ కూతురు శ్రీహిత నీట్ ర్యాంకు సాధించింది. మంగళవారం ప్రకటించిన నీట్ ఫలితాలలో 720 మార్కులకు గాను 644 మార్కులు సంపాదించి 98.48 శాతంతో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. ఈ సందర్భంగా కూతురిని తల్లిదండ్రులు అభినందించారు. తండ్రి ఆర్ఎల్‌సీగా విధులు నిర్వహిస్తుండగా తల్లి సరిత ధర్మపురి ఆదర్శ కళాశాలలో ఆంగ్ల భాష పీజీటీగా విధులు నిర్వహిస్తోంది. ఎటువంటి లాంగ్ టర్మ్ లేకుండా మొదటి విడతలోనే మెడిసిన్ ఉత్తమ ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ చిన్నప్పటినుండి వైద్యవృత్తిలో రాణించాలని భావించానని, దీనికి తోడు తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తాను ఈ ఘనత సాధించినట్లు తెలిపారు. శ్రీహిత ఏడో తరగతి వరకు బెల్లంపల్లి సెయింట్ మేరీ పాఠశాలలో చదివి 8వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు హైదరాబాద్ శ్రీ చైతన్యలో చదివింది. నీట్‌లో ఉత్తమ ఫలితం సాధించడం పట్ల పలువురు విద్యార్థినిని అభినందించారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేష్ భారీ మెజార్టీతో గెలుపొందడంతో బుధవారం బీజేపీ శ్రేణులు జిల్లా కేంద్రంలో టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకొని సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో సుస్థిర పరిపాలన బీజేపీతోనే సాధ్యమవుతుందని, ప్రజలు గమనించారని దీనిని ఆధారంగా మరోసారి మెజార్టీ అందించారన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అరిగేల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్, వైస్ ఎంపీపీ సుంకరమంగా పెంటయ్య, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్, ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రహ్లాద్, నాయకులు ప్రసాద్ గౌడ్, గాజుల సత్యనారాయణ, ఐలవేని సంతోష్, బండి రవి, బాపు, దాసరి మల్లేష్, జయరాజ్, సత్తన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వాహనదారులు సహకరించాలి

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య తీరాలంటే వాహనదారులు సహకరించాలని ఎస్ఐ సాగర్ తెలిపారు. మండలకేంద్రంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని, వాహన, దుకాణదారులు వాహనాలు నిలపకుండా సహకరించాలన్నారు. రోడ్డు భద్రత నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నిలిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనాథ పిల్లలకు అండగా నిలిచిన దాతలు

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని పార్డి గ్రామానికి చెందిన మడావి దివాకర్ పిల్లలు తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారారు. వీరి గురించి ఇటీవల పత్రికల్లో కథనం రాగా దాతలు స్పందించారు. దాతలు నేరుగా పిల్లలకి భరోసా కల్పించారు. జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, బాలల సంరక్షణ అధికారి సైతం వచ్చి నిత్యావసరాలు అందించి, స్పాన్సర్షిప్ కింద ప్రతినెల రూ. 4 వేలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఇక మానవతా దృక్పథంతో దాతలు నగదు రూపకంగా సాయం పంపారు. దాతలు అందించిన రూ.40, 500లను జమ చేశారు. కాగా బుధవారం పిల్లలకు కౌటాల సీఐ సాదిక్ పాషా, ఎస్ఐ మధుకర్, విలేకరులతో కలిసి నగదు, 75 కేజీల బియ్యం అందజేశారు. ఇవే కాక ఇప్పటివరకు దాతలు వేర్వేరుగా 4 క్వింటాళ్ల బియ్యం, నూనె డబ్బాలు, నగదు, నిత్యావసర సరుకులను చంటి బాబుకు పాల డబ్బాలతో పాటు మరో రూ.4వేలను అందించారు. మానవీయ విలువలను మరోసారి చాటిన దాతలందరికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని రక్షించడంలో ప్రతి ఒక్కరు పాత్రధారులు కావాలని ఆసిఫాబాద్ డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని రేంజ్ కార్యాలయం నుండి ప్రధాన రహదారుల గుండా రెబ్బెన ఇన్‌చార్జి రేంజ్ అధికారి శ్రీధరాచారితో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం పూర్తిగా కాలుషితం అవుతుందన్నారు. దాన్ని తగ్గించడంలో ప్రతి వ్యక్తి పాత్ర పోషించాల్సి ఉంటుందని తెలిపారు. మానవ అవసరాలకోసం ప్రకృతిని నాశనం చేయటం ప్రారంభించామో అప్పుడే పతనం ప్రారంభమైందని అన్నారు. చివరకు మానవ మనుగడే ప్రశ్నార్థకం అయ్యే దశకు చేరబోతోందన్నారు. పరిశ్రమలు, వాహనాల నుంచి వచ్చే వ్యర్థాలు గాలి, నీరు, భూమిని, అంతరిక్షాన్ని అన్నింటిని కాలుషితం చేస్తున్నాయన్నారు. వీటి నివారణ కోసం సాధ్యమైనంత వరకు మొక్కలు నాటి పెంచే బాధ్యత తీసుకోవాలన్నారు. మొక్కలతో కావాల్సిన ఆక్సిజన్ లభించడంతో పాటు పర్యావరణ సమతుల్యం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారులు సరోజరాణి, రాజేశ్వరాచారి, సెక్షన్అధికారులు సాయి, సతీష్, భగవంతరావు, సత్యనారాయణ, బీట్ అధికారులు పాల్గొన్నారు.

తిర్యాణిలో..

ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని తిర్యాణి మండల కేంద్రంలో తిర్యాణి, గిన్నెదరి అటవీ రేంజ్ అధికారుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి ఘనంగా వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి నీరుపోశారు. అనంతరం తిర్యాని, గిన్నెదరి రేంజ్ అధికారులు శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రజలు తమతో కలిసి రావాలన్నారు. దీనికోసం ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రెండు రేంజ్‌ల అటవీ అధికారులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ శాఖ అధికారులు, సిబ్బంది

పెంచికల్‌పేట్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అగర్‌గూడ గ్రామంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో బీట్ అధికారులు అర్జున్ రెడ్డి, వెంకటేష్ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, నీటి వృథానీ అరికట్టి ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని, ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని సూచించారు.

వాంకిడి : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకోని యూపీహెచ్‌సీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారం భట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచభూతాల సమతుల్యతను కాపాడుకోవాలన్నారు. వాతావరణం కలుషితం కాకుండా చూసుకోవాలని సూచించారు. వాతావరణ, నీటి కాలుష్యానికి చెట్ల నరికివేత కూడా ఒక కారణమన్నారు. దీనిపై ప్రజలలో అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు ప్రపంచ పర్యావరణ దినోత్సవ వాల్ పోస్టలను విడుదల చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధాకర్ నాయక్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ కె.వినోద్ కుమార్, సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రెబ్బెన : బెల్లంపల్లి ఏరియా ఖైరగూడ ఓపెన్ కాస్ట్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన సదస్సులు నిర్వహించారు. పర్యావరణ సమతుల్యం పెంపొందించడానికి ఎడారి భూములను పచ్చిక మైదానాలుగా మలిచి జీవ సమతుల్యాన్ని కాపాడాలని సింగరేణి అనేక చర్యలు చేపడుతుందని, ఇందులో భాగంగా ప్రతి ఒక్కరూ తమవంతుగా పర్యావరణ రక్షణలో భాగం కావాలని అధికారులు సూచించారు. ఇందులో సింగరేణి అధికారులు, గని కార్మికులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : తిర్యాణిలో మొక్కలు నాటుతున్న అటవీ శాఖ అధికారులు



పెంచికల్‌పేట్ : గ్రామస్తులకు అవగాహన కల్పించి అభివాదం చేస్తున్న అధికారులు



ఆసిఫాబాద్ : తిర్యాణిలో పర్యావరణ దినోత్సవంలో అధికారులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
గురువారం | జూన్ 06, 2024 | www.navatelangana.com

వికలాంగులకు ఉచిత బస్ పాస్‌లు

నవతెలంగాణ-మంచిర్యాల



మంచిర్యాల జిల్లాలో వికలాంగులకు ఉచిత బస్ పాస్‌లను అందించారు. మంచిర్యాలకు చెందిన మహిళా తరంగిణి గ్రూప్ సభ్యులు బుధవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రం వద్ద అంగవైకల్యం, మూగ, చెవిటి, కంటి చూపు లేని వారికి దాదాపు 100 మంది ఉచిత బస్ పాస్‌లు అందించారు. వికలాంగులు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్‌లతో వివరాలు నమోదు చేసుకొని ఉచిత బస్ పాస్‌ను పొందారు. మహిళా తరంగిణి అధ్యక్షురాలు రాచకొండ మంజుల, కార్యదర్శి లతా, సత్యవతి, ఆర్టీసీ డీఎమ్ రవీంద్రనాథ్, ఆర్టీసీ సిబ్బంది ఉమా రాణి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆఫ్‌లైన్ బదిలీలను నిర్వహించండి

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే ఉపాధ్యాయుల బదిలీ ప్రమోషన్ల ప్రక్రియను ఆఫ్‌లైన్‌లోనే చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు భూక్య రాజేష్ నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న బదిలీలలో ఆన్‌లైన్‌లో చేసే విధానంలో చాలా ఇబ్బందులు ఉన్నాయని గతంలోనే ఉమ్మడి జిల్లాలో అనేక ఐక్య ఉపాధ్యాయ సంఘాలు దీన్ని వద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని నివేదించాయన్నారు. త్వరలో జరగబోయే బదిలీ విధానంలో ఆఫ్‌లైన్‌లోనే ఉపాధ్యాయుల బదిలీ ప్రమోషన్ల ప్రక్రియను చేపట్టి అదేవిధంగా రాష్ట్రంలోని ఐటీడీఏ ప్రాంతాలలో పనిచేస్తున్న గిరిజన ఉపాధ్యాయులకు ఈ ఉపాధ్యాయులతో పాటు బదిలీల ప్రక్రియను షెడ్యూల్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దస్తురాబాద్ మండల అధ్యక్షుడు తుంగూరు వెంకటరాజ్యం పాల్గొన్నారు.

గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్



నవతెలంగాణ-నస్పూర్

నిర్ణీత మస్టర్లు పూర్తిచేయని కార్మికులకు ఎస్ఆర్పీ-3,3ఏ గనిపై కాన్ఫరెన్స్ హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్పీ గ్రూప్ ఏజెంట్ గోపాల్ సింగ్ మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి నిర్ణీత మస్టర్లు తప్పని సరిగా పూర్తిచేయాలన్నారు. విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించి విధులకు హాజరు కాకపోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డ్యూటీ చేయటం వల్ల కలిగే ప్రయోజనాల పట్ల అవగాహన కల్పించారు. చిన్న చిన్న కారణాలతో విధులకు గైర్హాజరు కావడం వల్లన వ్యక్తిగతంగా వేతనాలు కోల్పోవ్వడంతో పాటు, ఉత్పత్తి పరంగా సంస్థకు నష్టం వాటిల్లడం జరుగుతుందన్నారు. వ్యక్తిగత పనులు, అనారోగ్య సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకోవస్తే పరిష్కరించే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా ఉద్యోగులు క్రమం తప్పకుండ విధులకు హాజరు కావాలని సూచించారు. సింగరేణి లాంటి ప్రభుత్వ సంస్థలో ఉద్యోగం లభించడం గొప్ప అదృషంగా భావించవలసినదిగా తెలిపారు. సింగరేణి సంస్థ ఉద్యోగులందరికి మంచి వేతనాలతో పాటు సౌకర్యాలు కూడా ఏర్పాటు చెయ్యడం జరిగిందని, నిబద్ధతతో క్రమం తప్పకుండ పనిచేస్తూ యాజమాన్యం కల్పించే ప్రయోజనాలను అందరూ సద్వినియోగం చేసుకోవలసినదిగా కోరారు. గైర్హాజరు వల్ల నష్టాలను వివరించి, మరోమారు కారణం లేకుండా విధులకు దూరమైతే కంపెనీ నియమ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీవై జీఎం సంతోష్ కుమార్, సంక్షేమాధికారి గౌస్ పాషా,పిట్ సెక్రటరీ మురళీ చౌదరి, రక్షణాధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

బాలపురస్కార్‌కు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నస్పూర్

వివిధ రంగాలలో అభిరుచి, ప్రతిభ కలిగిన 18 ఏండ్లలోపు బాలబాలికల నుంచి ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలపురస్కార్-2025కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారి కె చిన్నయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆవిష్కరణ రంగంలో ఏ రంగంలోనైనా సానుకూలంగా ప్రభావితం చేసే ఆవిష్కరణలు పరిగణలోకి తీసుకోబడతాయని, సామాజిక సేవ రంగంలో మహిళలు, పిల్లలు, ఇతరుల హక్కుల పట్ల సంఘాన్ని ప్రేరేపించడం, నిర్వహించడం, సమీకరించడం వంటి నాయకత్వ నైపుణ్యాలు, పర్యావరణ రంగంలో తీవ్రమైన స్థాయిలలో పర్యావరణ సమస్యలలో స్థిరమైన ప్రయత్నాలు, విజయాలు, క్రీడా రంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో స్థిరమైన విజయాలు, కళ, సంస్కృతి రంగంలో కళ, సంగీతం (గాత్రం, వాయిద్యం), నృత్యం, పెయింటింగ్ ఇతరత్రా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో సాంస్కృతిక వారసత్వం, విజయాలను ప్రోత్సహించడానికి స్థిరమైన ప్రయత్నాలు, సైన్స్ టెక్నాలజీ రంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సైన్స్, టెక్నాలజీ సమస్యలలో స్థిరమైన విజయాలు పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల బాలబాలికలు వ్యక్తిగత ఆయా రంగాలలో పని చేసే సంస్థలు తమ దరఖాస్తులను జూలై 31వ తేదీ లోగా ఆన్‌లైన్ అవార్డు పోర్టల్ అవార్డ్స్.జీఓవీ.ఇన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

నీట్ ఫలితాల్లో సీఓఈ విద్యార్థు ప్రతిభ

నవతెలంగాణ-తాండూర్

నీట్-2024 ఫలితాల్లో బెల్లంపల్లి సీఓఈ నుండి పరీక్షకు హాజరైన 26 మంది విద్యార్థుల్లో 11మంది క్వాలిఫై అయినట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. వీరిలో జుమ్మిడి ప్రణయ్ 404 మార్కులు సాధించి 34146 ఆలిండియ కేటగిరి ర్యాంకుతో కళాశాల టాపర్‌గా నిలిచాడని తెలిపారు. కౌటాల మండలం బోదంపల్లి గ్రామానికి చెందిన వనిత-పెంటయ్యల కుమారుడు ఎంబీబీఎస్ సీటు సాధించారన్నారు. అదేవిధంగా గోమాస ఆఖిల్ 375 మార్కులు(42529 ర్యాంకు), మౌల్కర్ శివకృష్ణ 333 (56456 ర్యాంకు), యెరెకర్ నికిత్ 293 (1345 పీడబ్ల్యూడీ ర్యాంకు) సాదించారని తెలిపారు. అత్యుత్తమ ఫలితాలతో ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్న బెల్లంపల్లి సిఓఈ అధ్యాపకులను మరియు ప్రిన్సిపాల్ సైదులును ఆదిలాబాద్ రీజియన్ ఆర్సీఓ కొప్పుల స్వరూపరాణి అభినందించారు. ఈ సందర్భంగా బుదవారం అధ్యాపకులు మిఠాయిలు పంచుకొని ఒకరినొకరు అభినందనలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్ కుమార్, అధ్యాపకులు పిన్నింటి కిరణ్, మిట్ట రమేష్, అనుముల అనిరుద్, చందా లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-జన్నారం

మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యం సతీష్ అమ్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని బుధవారం ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖా నాయక్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మృతు రాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, కాంగ్రెస్ కార్యకర్తలు షాదుపాషా, నోముల రాజకుమార్, రజాక్, కుదిరే వెంకన్న, రవి, మౌలానా పాల్గొన్నారు

యువతి వివాహానికి ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్షెటిపేట మున్సిపాలిటీకి చెందిన నిరుపేద యువతి వివాహానికి మైనార్టీ మండల అధ్యక్షుడు, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ షాహిద్ అలీ బుధవారం ఆర్థిక సాయం చేశారు. పట్టణానికి చెందిన కూలి పనిచేసుకునే అహ్మద్ కూతురి వివాహానికి రూ. 14 వేల అర్థిక సాయం అందజేశారు. అనంతరం కాలనీకి చెందిన పలువురు ముస్లిం యువతి, యువకులకు, మహిళలకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. నేటి సమాజంలో తల్లిదండ్రుల నిర్లక్ష్యం, సోషల్ మీడియా, సెల్ ఫోన్ ఎఫెక్ట్ కారణంగా యువత తప్పుదోవ పడుతున్నారు. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక దష్టి పెట్టాలని సూచించారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి

నవతెలంగాణ-మందమర్రి



ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ అధ్యక్షులు వేజ్ బోర్డు నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. బుధవారం ఏఐటీయూసీ ఏరియా ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ కెకె-5 గని వద్ద గేటు మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వాసిరెడ్డి సీతారామయ్య హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సంస్థ లాభాలను ప్రకటించి జూన్ నెలలో 35 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలన్నారు. సింగరేణి ఎన్నికలలో గుర్తింపు సంఘంగా గెలిచిన ఏఐటీయూసీ యూనియన్‌కు గుర్తింపు సంఘం పత్రాన్ని ఇవ్వకపోవడం వలన స్ట్రక్చర్ సమావేశాలు జరగక కార్మిక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని తక్షణమే యాజమాన్యం గుర్తింపు సంఘం పత్రాన్ని ఇవ్వాలని లేనియెడల ఆందోళన చేస్తామని డిమాండ్ చేసారు. గని ప్రమాదాలలో కార్మికులు ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు పెద్ద దిక్కును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టక పోవడంతోనే గని ప్రమాదాల్లో కార్మికులు మరణిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ భీమ నాధుని సుదర్శన్, సోమిశెట్టి రాజేశం, పెద్ద పెల్లి దానయ్య, పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, పిట్ కమిటీ సేఫ్టీకమిటీ నాయకులు, వర్క్ మెన్ ఇన్స్‌పెక్టర్ విక్రమ్ సింగ్, వరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు గ్రీన్ ఛాంపియన్ అవార్డు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

తెలంగాణ ప్రభుత్వ కాలుష్య నియంత్రణ మండలి (తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్)వారు ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2024 సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో కళాశాలల విభాగంలో లక్షెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 'గ్రీన్ ఛాంపియన్ అవార్డ్ 2024' ప్రథమ బహుమతిని గెలుచుకుంది. ఈ అవార్డును ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2024 సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, పర్యావరణ అటవీ శాస్త్ర సాంకేతిక రంగాల ప్రిన్సిపాల్ సెక్రటరీ వాణి ప్రసాద్, ఐఏఎస్‌ల మెంబర్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్ చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓఝూ బహుమతిని అందుకున్నారు.

నిరంతరం పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు

కళాశాలలో చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా నిరంతరం కొనసాగుతున్న మొక్కల పెంపకం, నీటి వనరుల పొదుపు, విద్యుత్ పొదుపు, ప్లాస్టిక్ రహిత కళాశాల ప్రాంగణం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి కళాశాలలో లక్షెట్టిపేట మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న అవగాహన సదస్సులు, లక్షెట్టిపేట నందు నిర్వహించిన క్లీన్ గోదావరి సేవ్ గోదావరి కార్యక్రమానికి లభించిన గుర్తింపు ఇది అని ఆనందాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నుండి ప్రముఖ సీనియర్ సామాజికవేత్త ప్రసన్న కుమార్ పర్యవేక్షించి, ప్రశంసించి ఈ కార్యక్రమాలను ఇలాగే కొనసాగించాల్సిందిగా సూచించారు. ఇదేవిధంగా మరిన్ని కార్యక్రమాలు కళాశాలలో నిర్వహిస్తామని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కళాశాలకు ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సునకు అనుమతి వచ్చినందుకు కళాశాల విద్యాశాఖ మాజీ కమిషనర్ వాణి ప్రసాద్ ప్రత్యేక అభినందనలు తెలియజేసినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌ను నమ్ముకున్న వారికి న్యాయం చేస్తాం

- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

నవతెలంగాణ-జైపూర్



నా గెలుపుకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు ఎప్పుడు రుణపడి ఉంటానని, కాంగ్రెస్‌ను నమ్ముకుని కష్ట కాలంలో కూడా పార్టీని వీడకుండా ఉన్న వారికి తప్పక న్యాయం చేస్తానని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. పెద్దపల్లి ఎంపీగా బుధవారం చెన్నూర్ నియోజకవర్గానికి వచ్చిన ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకా వారసునిగా గుర్తించిన పెద్దపల్లి పార్లమెంట్ పరిధి ప్రజలు నాకు ఇచ్చిన అవకాశాన్ని బాధ్యతగా నిర్వర్తిస్తానని అన్నారు. పెద్దపల్లి ప్రాంత అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు తీసుకురావడమే కాకుండా ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీకి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని అన్నారు. ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎలాగైతే తిరస్కరించారో అదేవిధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని దేశ ప్రజలు తిరస్కరించారని అన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ నియంతృత్వంగా వ్యవహరించారో దేశంలో నరేంద్రమోడీ అదేవిధంగా నియంతృత్వంగా వ్యవహరించాడని అన్నారు. ఈ సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ చల్ల రాంరారెడ్డి, టౌన్ అధ్యక్షుడు చెన్న సూర్యనారాయణ, సీనియర్ నాయకులు హిమంతరెడ్డి, ఘన్‌శ్యాం, రాయమల్ల గౌడ్ పాల్గొన్నారు.

సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో జూన్ 13 నుండి నిర్వహించనున్న సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దివ్యాంగ ధ్రువీకరణ పత్రం పొందేందుకు మీ-సేవలో స్లాట్ బుక్ చేసుకొని నిర్ణీత తేదీలలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించి నూతన దివ్యాంగ ధ్రువీకరణ పత్రం, గతంలో పొందిన ధ్రువీకరణ పత్రం కాలపరిమితి ముగిసిన వారు పునఃరుద్ధరించుకోవాలని తెలిపారు. జూన్ 13న శారీరక వికలాంగులు-ఆర్థో (50), 19న మానసిక వికలాంగులు (50), 21న కంటిచూపు(30), 25న మూగ, చెవుడు(50) అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఈ నెల 7వ తేదీన ఉదయం 10 గంటలకు స్లాట్ ఓపెన్ చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అనారోగ్యంతో స్కూల్ అసిస్టెంట్ మృతి

జన్నారం : మండలంలోని ఇంధన్‌పల్లి జడ్పీ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దేవాజీ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్లోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. దేవాజీ జన్నారం పట్టణంలోని శ్రీలంక కాలనీలో నివాసం ఉంటున్నారు.

మొక్కు చెల్లించుకున్న పవన్ కళ్యాణ్ అభిమాని

నవతెలంగాణ-జన్నారం



ఆంధ్రప్రదేశ్‌లోని పిఠాపురంలో పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేగా గెలిస్తే, అలాగే ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గొడ్డం నగేష్ ఎంపీగా గెలిస్తే, హనుమాన్ ఆలయంలో 51 కొబ్బరికాయలు కొడతానని మొక్కుకున్న పవన్ కళ్యాణ్ అభిమాని, బీజేవైఎం మండల నాయకుడు ముడుగు ప్రవీణ్ కుమార్ బుధవారం 51 టెంకాయలు కొట్టి ఆ మొక్కును తీర్చుకున్నారు. సందర్భంగా వారిని మాట్లాడుతూ ఆంధ్ర ప్రజల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తూ, పేదల పక్షాన నిలిచిన పవన్ కళ్యాణ్ తన ఇరవై ఒక్క మంది ఎమ్మెల్యేలను గెలిపించుకొని తను గెలవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎంతగానో పాటుపడతాడని అన్నారు. ఆదిలాబాద్ ఎంపీగా నగేష్ ఇక్కడి పేద గిరిజనులకు ఎస్సీ ఎస్టీలకు, అందరి అభివృద్ధి కోసం పాటుపడతాడు అన్నారు. ఇలాంటి వ్యక్తులను గెలిపిస్తేనే సమాజాభివృద్ధికి తోడ్పాటు అందిస్తారన్నారు.

ఖరీఫ్ సాగుకు సమాయత్తం కావాలి

నవతెలంగాణ-తాండూర్



రైతులు ఖరీఫ్ (వానాకాలం) పంటల సాగుకు సమాయాత్తం కావాలని మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి తెలిపారు. ఋతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించిన నేపథ్యంలో ఖరీఫ్ పంటల సాగు విషయంలో బధవారం నవతెలంగాణతో ఆమె మాట్లాడారు. మండలంలోని తాండూర్, రేచీని, కిష్టంపేట క్లస్టర్ల పరిధిలో మొత్తం 8445 మంది రైతులు 19010 ఎకరాల విస్తరణంలో పంటలు సాగు చేస్తున్నట్లు తెలిపారు. చెరువులు, బోరు బావుల కింద 2821 రైతులు 3914 ఎకరాల వరి సాగు చేస్తున్నట్లు వివరించారు. 5216 రైతులు 14925 ఎకరాల్లో పత్తి సాగు చేయగా 408 రైతులు 171 విస్తీర్ణంలో కంది పంట వేయనున్నట్లు తెలిపారు. ప్రధాన పంట పత్తిలో రైతులు తగు జాగ్రత్తలు పాటించి అధిక దిగుబాటలు పొందాలని సూచించారు. భూమి పూర్తిస్థాయిలో తడిసిన తర్వాతే విత్తనాలను 10 సెంటీమీటర్ల లోతులో నాటాలని తెలిపారు. పత్తి విత్తనాలు నాటిన రెండు రోజులలోపు పెండిమిథలిన్ రసాయనాన్ని భూమి తడిచేటట్లు పిచికారి చేసినట్లయితే 30 రోజుల వరకు కలుపు నివారించవచ్చునని తెలిపారు నీటి వసతి కింద లావు పింజరకాలు వర్షాధారం కింద మధ్యస్థ కాయలు గల రకాల పత్తి విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు తయారు తేది మొలక శాతాన్ని పరీక్షించుకోవాలన్నారు. నీటి వసతి గల రైతులు వరి పండించే రైతులు జూన్ రెండోవారానికల్లా విత్తనాలను నారు పోసుకోవాలని సూచించారు. నారుమడి తయారు చేసేటప్పుడు నేలను పశువుల ఎరువుతో కలియదున్నాలని తెలిపారు ఆరోగ్యం అంతమైన నారుమడి పెరుగుదల పంట దిగుబడిని నిర్దేశిస్తుందన్నారు. కంది పండించే రైతులు విత్తనాలను ట్రైకోడెర్మా విరిడితో విత్తన శుద్ధి చేసినట్లయితే కందిలో ఎండు తెగులు రాకుండా అరికట్ట వచ్చిందని తెలిపారు. రైతులు సమయానుకూలంగా సాగులో మెలకువలు పాటిస్తూ అధిక దిగుబడులు పొందాలని సూచించారు.

ఎంఈఓపై చర్యలు తీసుకోవాలి

- ఐక్య విద్యార్థి సంఘాల డిమాండ్



నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణంలోని స్మార్ట్ కిడ్స్ పాఠశాలకు వత్తాసు పలుకుతున్న ఎంఈఓను సస్పెండ్ చేయాలని ఐక్య విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం జిల్లా కేంద్రంలోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ఫ్లె కార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ మంచిర్యాల పట్టణంలోని బైపాస్ రోడ్‌లో గల స్మార్ట్ కిడ్స్ పాఠశాలలో ఎలాంటి అనుమతులు లేకుండా వారి ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తూ, స్కాలర్‌షిప్ టెస్టల పేరుతో అమాయకులైన తల్లిదండ్రులను, విద్యార్థులను మోసం చేస్తూ పరీక్షలు నిర్వహిస్తున్నారని, ఈ విషయ పై మండల విద్యాశాఖ అధికారికి తెలియజేసినప్పటికీ పట్టించుకోకుండా ఆ పాఠశాలకు మద్దతు తెలుపుతున్నారని విమర్శించారు. జీవో ఎంఎస్ నెంబర్ వన్ ప్రకారం కనీస సౌకర్యాలు మౌలిక సదుపాయాలు లేకుండా నిర్వహిస్తున్నప్పటికీ ఆ పాఠశాలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించి మండల విద్యాశాఖ అధికారిని సస్పెండ్ చేయాలని, స్మార్ట్ కిడ్స్ పాఠశాలపై చర్యలు తీసుకొని పాఠశాలను సీజ్ చేసి గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు జుమ్మిడి గోపాల్, షేక్ సల్మాన్ పాషా, చేరాల వంశీ, బచ్చలి ప్రవీణ్ కుమార్, రేగుంట క్రాంతి కుమార్, పురేళ్ల నితీష్ పాల్గొన్నారు.

గని వద్ద మంకీ ఫుడ్ కోర్ట్ ఏర్పాటు



నవతెలంగాణ-మందమర్రి

మంకీ ఫుడ్ కోర్ట్ ఏర్పాటుకు కేకే-5 గని వద్ద 200 రకాల పండ్ల మొక్కలను నాటారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సింగరేణి సీఎండీ బలరాం ఆదేశాల మేరకు బుధవారం మందమర్రి ఏరియాలోని కేకే-5 గనిలో మేనేజర్ అల్లా ఉద్దీన్ ఆధ్వర్యంలో మంకీ ఫుడ్ కోర్ట్ ఏర్పాటుకు సుమారు 200 రకాల పండ్ల మొక్కలను నాటారు. ముఖ్య అతిథిగా ఏరియా ఇంజనీర్ ఏజీఎం నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పక్షులు కోతులకు ఆహారం కొరకై అడవిని వదిలి జనావాసాలకి వస్తున్న క్రమంలో వాటి కొరకై గని ఆవరణలో పండ్ల మొక్కలు తాగు నీరు తొట్టెలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొక్కలను పెట్టడమే కాకుండా వాటి సంరక్షణని కూడా ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రక్షణ అధికారి రమేష్, అసిస్టెంట్ మేనేజర్ జశ్వంత్, సంక్షేమాధికారి కార్తీక్, పిట్ ఇంజనీర్ నవీన్, ఎన్విరాన్మెంట్ అధికారి బలరాం, గని పిట్ సెక్రెటరీ గాండ్ల సంపత్, వర్క్మెన్ ఇన్స్‌పెక్టర్ విక్రమ్ సింగ్ పాల్గొన్నారు.

ఇదే ఊపుతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఢంకా మోగించాలి

- మాజీ ఎంపీ రాథోడ్ రమేష్

నవతెలంగాణ-జన్నారం



దేశంలో రాష్ట్రంలో బీజేపీ గెలిచిన ఇదే ఊపుతొ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో డంకా మోగించాలని ఆదిలాబాద్ మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోడీ మరోసారి ప్రధాని అవడం, ఆదిలాబాద్ బీజేపీ ఎంపీగా గెడం నగేష్ గెలవడం ఎంతో శుభ పరిమాణం అన్నారు. గేడం నగేష్ గెలుపునకు కృషి చేసిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అందరి కృషి వాళ్ళనే ఖానాపూర్ నియోజకవర్గంలో 15 వేల మెజార్టీ సాధించామన్నారు. కష్టపడ్డ కార్యకర్తలకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గుర్తింపు ఉంటుందన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీలకు ఇప్పటి నుంచే కార్యకర్తలు సన్నద్ధం కావాలన్నారు. ప్రతి కార్యకర్తకు బీజేపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన రావు, మాజీ మండల అధ్యక్షుడు గోలి చందు, జిల్లా నాయకులు కొంతం శంకరయ్య, బద్రి నాయక్, రాగుల సూర్యం, బొంతల మల్లేష్, లక్ష్మీ రాజం, మహేష్, కమ్మల భూమయ్య నాడెం శ్రీనివాస్ పాల్గొన్నారు.

తెలంగాణ ఆర్టిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడుకి సన్మానం

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ ఆర్టిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవలే ఎన్నికైన జన్నారం పట్టణానికి చెందిన తాళ్లపల్లి రాజేశ్వర్‌ను నేతకాని మహర్ విద్యార్థి సంఘం, నేతకాని మహర్ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. సందర్భంగా తెలంగాణ నేతకాని మహర్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత, సంఘం మండలాధ్యక్షుడు రత్నం లక్ష్మణ్ మాట్లాడుతూ రాజేశ్వర్ మంచి కళానైపుణ్యం కలిగిన ఆర్టిస్టుగా మంచి పేరు తెచ్చుకున్నారని, వారి సంక్షేమం కోసం నిరంతరం కృషిచేస్తూ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులవ్వడం నేతకాని సమాజానికి దక్కిన గౌరవమని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి వెంకట్, నేతకాని ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు బోర్లకుంట రాజయ్య నేత, తెలంగాణ నేతకాని మహర్ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి దుర్గం వినోద్ నేత, జిల్లా కార్యదర్శి అల్లూరి వినోద్ కుమార్ నాయకులు జాడి శివాజీ, పవన్ పాల్గొన్నారు.

సింగరేణి ఏరియా ఆస్పత్రికి గ్రీన్ ఛాంపియన్ అవార్డు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా తెలంగాణ కాలుష్య నియంత్రనా మండలి వారు నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో పట్టణంలోని స్థానిక సింగరేణి ఏరియా ఆస్పత్రికి టీజీ పీసీబీ గ్రీన్ ఛాలెంగింగ్ అవార్డు 2023 దక్కింది. బుధవారం హైదరాబాద్‌లోని సనత్ నగర్‌లో అవార్డు ప్రదోనోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి వాణి ప్రసాద్(ఐఏఎస్) ప్రిన్సిపల్ సెక్రెటరీ ఈఎఫ్ఎస్టి డిపార్ట్మెంట్ వారి చేతుల మీదుగా ఏరియా ఆస్పత్రి ఏసిఎమ్ డాక్టర్ ఉషకు అందజేశారు. ఈ సందర్భంగా మందమర్రి జనరల్ మేనేజర్ ఏ.మనోహర్ వారికి అభినందనలు తెలియజేశారు.

న్యాక్ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణ

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికుల కుటుంబ సభ్యులైన మహిళలుకు, యువతులకు న్యాక్ ఆధ్వర్యంలో టైలరింగ్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఎం నాగేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల కార్మికులు లేబర్ కార్డు దరఖాస్తుదారు ఆధార్ కార్డ్, బ్యాంక్ పాస్ బుక్, స్టడీ సర్టిఫికెట్ జిరాక్స్ పత్రాలతో పాటు నాలుగు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో జూన్ 9వ తేదీ వరకు పట్టణంలోని స్థానిక శిశుమందిర్ పాఠశాలలో న్యాక్ శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోగలరని తెలిపారు. మూడు నెలల శిక్షణతో పాటు అవసరమైన మెటీరియల్, శిక్షణ అనంతరం కుట్టు మిషన్, సర్టిఫికెట్ అందజేస్తామని పేర్కొన్నారు. మహిళలు యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9948154198, 9989470 292 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో బుధవారం దూదుగండి వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. వ్యక్తి శరీరం నుజ్జునుజ్జు కావడంతో ఎవరనేది గుర్తించలేకపోయారు. వ్యక్తి నీలి రంగు జీన్స్ ప్యాంట్, తెలుపు రంగు టీ షర్ట్ ధరించి ఉన్నాడు. పెద్దగా పెరిగిన జుట్టుతో ఉన్నాడు. తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో భద్రపరిచామని, సంబంధికులు ఎవరైన ఉంటే తమను(సెల్8712659947) సంప్రదించాలని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-ఆసిఫాబాద్



2023 జూన్ నెలలో పోగొట్టుకున్న సెల్ ఫోన్ బాధితుని ఫిర్యాదు మేరకు ట్రేస్ అవుట్ చేసి స్థానిక సీఐ సతీష్ బాధితునికి అందజేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఫ్లెక్సీ ప్రింటర్ యజమాని శ్రావణ్ కుమార్ గత సంవత్సరం జూన్ నెలలో తన ఐఫోన్ పోగొట్టుకున్నాడు. స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దానిని సియర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితునికి అప్పగించినట్లు తెలిపారు. ఎవరైనా మొబైల్ పోగొట్టుకుంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. మొబైల్ ట్రేస్ అవుట్ చేయడంలో సిబ్బంది రుకియా సుల్తానా సహకరించినట్లు తెలిపిన ఆయన ఆమెను అభినందించారు.

అధికారంలో ఉన్నా కాంగ్రెస్‌కు దక్కని ఆధిక్యం

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా, ఖానాపూర్ ఎమ్మెల్యే సైతం ఆ పార్టీ నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయినా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఆశించిన ఆధిక్యం రాకపోవడం గమనార్హం. చెప్పుకోదగ్గ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు ఉన్నప్పటికీ ఖానాపూర్ నియోజకవర్గంలో మెజారిటీ ఓట్లు రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యారు. స్థానికంగా వివిధ పదవుల్లో ఉన్న నాయకుల బూత్‌ల పరిధిలోనే పార్టీకి ఆధిక్యం తక్కువ రావడాన్ని కార్యకర్తలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. గడిచిన 30 ఏండ్లలో నియోజకవర్గంలో పార్టీకి అధికారం దక్కలేదు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో అటు రాష్ట్రంలో అధికారం చేపట్టగా, ఇక్కడ వెడ్మ బొజ్జుకు ఎమ్మెల్యేగా అవకాశం దక్కింది. అధికారంలో లేకున్నా, అంతగా క్యాడర్ లేకున్నా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నాలుగు వేల పైచిలుకు మెజారిటీతో గెలిచారు. ఇప్పుడు అధికారం, బలమైన క్యాడర్ ఉండి కూడా పార్లమెంట్ ఎన్నికల్లో ఆధిక్యతను సాధించకపోవడం ఆ పార్టీ నాయకుల, కార్యకర్తల పనితీరుకు అద్దం పడుతోంది.

కుదరని ఏకాభిప్రాయం

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నుంచి పార్టీ క్యాడర్‌లో ఏకాభిప్రాయం లోపించినట్లు స్పష్టంగా కనిపించింది. అసెంబ్లీ ఎన్నికల వరకు బీఆర్ఎస్‌లో ఉన్న పలువురు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఓడిపోగానే కాంగ్రెస్‌లో చేరారు. సదరు నాయకుల చేరికను కాంగ్రెస్ పార్టీ పాత క్యాడర్ ఖానాపూర్‌లో జరిగిన కార్యకర్తల సమీక్ష సమావేశంలో మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సమక్షంలోనే తీవ్రంగా వ్యతిరేకించారు. కార్యకర్తల సంఖ్య ఎక్కువగా ఉంటే అది పార్టీకి మేలు చేకూరుతుందని, అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని మంత్రి సీతక్క సర్ది చెప్పారు. అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీలో కొత్త, పాత కార్యకర్తల మధ్య సమన్వయంలేని వాతవరణం ఏర్పడి పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గంలో ఆధిక్యం తగ్గడానికి కారణమైనట్లు చర్చించుకుంటున్నారు.

పట్టణంలోనూ అదే పరిస్థితి

నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్ పట్టణంలో సైతం కాంగ్రెస్ పార్టీ ఆధిక్యతను సాధించలేకపోయింది. ఎన్నికలకు ముందే ఖానాపూర్ మున్సిపల్ మెజార్టీ కౌన్సిలర్లు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. వీరి చేరికతో పార్టీ బలపడి ఓట్లు వస్తాయని ఆ పార్టీ నాయకత్వం భావించింది. కాని కౌన్సిలర్లపై స్థానికంగా ఉన్న వ్యతిరేకతను పార్టీ నాయకత్వం గ్రహించలేదని అంటున్నారు. పదేండ్లు ఇతర పార్టీలో ఉండి లబ్ధి పొందిన నాయకులను అనతికాలంలోనే కాంగ్రెస్‌లో చేర్చుకోవడం పార్టీకి తీవ్ర నష్టం కలిగించినట్లు పరిశీలకులు అంటున్నారు. పట్టణంలో 17బూత్‌లు ఉండగా 10 బూత్‌లలో బీజేపీ ఆధిక్యం కనబరచగా, 7బూత్‌లలో మాత్రమే కాంగ్రెస్ ఆధిక్యతను నిలబెట్టుకుంది. పట్టణంలో బీజేపీకి 6166 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 4606 ఓట్లు వచ్చాయి. ఏమాత్రం క్యాడర్ లేని బీజేపీకి పట్టణంలో కాంగ్రెస్ కంటే 1500 పైచిలుకు ఓట్లు ఎక్కువగా వచ్చాయి. అలాగే నియోజకవర్గంలో 13200 పైచిలుకు ఓట్లు బీజేపీకి ఎక్కువగా రావడం గమనార్హం. కాంగ్రెస్ కొత్త, పాత నాయకుల్లో లోపించిన సమన్వయం, ఆర్భాట శైలి కారణంగానే నియోజకవర్గంలో ఆ పార్టీకి ఆధిక్యం రాలేదని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.



నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే (ఫైల్)

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

- ఘనంగా పర్యావరణ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్‌టౌన్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, దాన్ని కాపాడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కోర్టు ఆవరణలో డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో న్యాయమూర్తులతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం అక్కడి నుంచి అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు మాట్లాడుతూ వాతావరణంలో సమతుల్యత లోపించడం కారణంగా ప్రకృతి వైపరీత్యాలు వస్తున్నాయన్నారు. దీన్ని పరిరక్షించేలా ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. నాటిన మొక్కలను వృక్షాలుగా చేసేలా సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, న్యాయమూర్తులు శివరాంప్రసాద్, ప్రమీల జైన్, మంజూల సూర్యవార్, దుర్గారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

మున్సిపల్ కార్యాలయంలోనూ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం పక్కన గల వాటర్ ట్యాంక్ వద్ద మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం గ్లోబల్ వర్మింగ్ పెరుగుతుందన్నారు. రోజురోజుకు చెట్లు నరుకుతున్నారని, పెంచే వారే లేరన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా చెట్లను నాటాలన్నారు. మున్సిపల్ తరపున చెట్లను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మొక్కను నాటి పూజ చేసిన మాజీమంత్రి

మొక్కల సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని, బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రతి ఒక్కరు ఐదు మొక్కలు నాటేందుకు కృషి చేయాలని మాజీ మంత్రి జోగు రామన్న పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మొక్కలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జోగు రామన్న మాట్లాడుతూ మొక్కల పెంపకం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పార్టీలకు అతీతంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. మొక్కల సంరక్షతోనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. అలాగే . అశోకుడు చెట్లు నాటించెను అనే స్ఫూర్తి నేడు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సారాధ్యంలోనే మళ్లీ అంతటి కీర్తిని సాధించామన్నారు. కార్యక్రమంలో నాయకులు విజ్జగిరి నారాయణ, రాజు, సేవ్వా జగదీష్, మెస్రం పరమేశ్వర్, అర్చన, రామ్ కుమార్, గడ్డం లక్ష్మణ్, నవాతే శ్రీనివాస్, సురేందర్, గెడ్డం రాజు, రాజేష్, రఘు, పాల్గొన్నారు.

అగ్రికల్చర్ కళాశాలలో అవగాహన

పర్యావరణంపై చైతన్యం కల్పించాలని వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంలో గల అగ్రికల్చర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణంపై కృష్ణ తీసిన రైతు నేస్తాలు వివిధ రకాల పక్షులు వన్యప్రాణుల అద్భుతమైన చిత్రాలను ప్రొజెక్టర్‌పై చూపిస్తూ వాటి ఆవశ్యకతను వివరిస్తు పర్యావరణాన్ని ఎలా కాపాడాలో తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సెమినార్

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలో ఎస్సీ స్టడీ సర్కిల్‌లో పర్యావరణంపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో జన విజ్ఞాన వేదిక పర్యావరణ సబ్ కమిటీ కన్వీనర్, పర్యావరణ ప్రేమికుడు ఆర్.శివకుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి నూతుల రవీందర్ కోశాధికారి శ్రీధర్ బాబు వేదిక జిల్లా నాయకులు వీరన్న, గంగన్న, ఉమాకాంత్ మెస్రం రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం

ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని స్టేడియం, గాంధీ పార్క్‌లో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో క్యాడెట్స్ మొక్కలు నాటారు. మొక్కలను నాటి వాటి సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని ఎన్‌సీసీ అధికారి శ్రీనివాస్ స్వామి తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు భూమన్న, చంద్రకాంత్ ఉన్నారు.

జైపూర్ : మన పిల్లలకు మంచి చదువులు చెప్పించడం, ఆస్థిపాస్తులు సంపాదించి ఇవ్వడమే కాకుండా మంచి పర్యావరణాన్ని అందించడం ఎంతో అవసరమని జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ జనరల్ మేనేజర్ బసివి రెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఎస్టీపీపీలో పర్యావరణ నడక (ఎన్విరాన్మెంటల్-వాక్) ఎంబీ టౌన్‌షిప్ నుండి ఫైర్ స్టేషన్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవాళి మనుగడతో ముడిపడివున్న పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యతని తెలిపారు. ఇప్పటికే దేశ రాజధానిలో 52 డిగ్రీల ఉష్ణోగ్రతను చూశామని ఇది ఇలాగే కొనసాగితే రాబోవు రోజుల్లో మనందరం తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తుందని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మనందరం మొక్కలు నాటడం తప్పనిసరి అన్నారు. తమవంతు బాధ్యతగా సింగరేణి ప్రతి సంవత్సరం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కాగా ఈ ఏడాది పర్యావరణ దినోత్సవ థీమ్ నేల పునరుద్ధరణ ఎడారీకరణ, కరువును తట్టుకునే శక్తి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆఫ్ ఓఅండ్ఎం జేఎన్ సింగ్, ఏజీఎం(సివిల్) ప్రసాద్, ఏజీఎం(పీసీఎస్) శ్రీనివాసులు, ఏజీఎం(ఎఫ్‌జీడీ) ఎంఎన్‌వీ రమణ, సీఎంఓఏఐ సెక్రటరీ సంతోష్ కుమార్, సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ శేఖర్, పీఎంపీఎల్ ప్లాంట్ హెడ్ అఖిల్ కపూర్, డీజీఎం(ఎన్విరాన్మెంట్) వాసుదేవ మూర్తి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ మోహన్ సింగ్ పాల్గొన్నారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో..

పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించుకోవాలంటే విరివిరిగా చెట్లు నాటాలని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ కాగజ్‌నగర్ డివిజనల్ మేనేజర్ శ్రావణి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల పరిధి కుందారంలో గల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో స్థానిక వైద్యులతో కలిసి మొక్కలు నాటారు. ఆరోగ్య కేంద్రం ఆవరణలో పండ్ల మొక్కలు నాటడం జరిగిందని ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు నీడనివ్వడంతో పాటు పండ్లు పంచినట్లు అవుతుందని అన్నారు. పర్యావరణ సమతుల్యత లోపించడం వల్ల ప్రకృతిలో తీవ్రమైన మార్పులు సంభవిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు శ్రావ్య, మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్ కుమార్, డిప్యూటీ ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మన్, రాకేష్, నరేష్ పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణంలో శ్రమదానం..

జైపూర్-భీమారం మధ్య రక్షిత అటవీ ప్రాంతంలో గల వెలిశాల మల్లన్న ఆలయ పరిసరాలను అటవీ అధికారులు శ్రమదానం చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక మండల పంచాయతి అధికారి అనిల్ కుమార్‌తో కలిసి ఆలయ ప్రాంగంలో చెత్త చెదారం, పరిసరాల్లో పడేసిన ప్లాస్టిక్ డబ్బాలు సేకరించి డంపుయార్డుకు తరలించారు. ఈ కార్యక్రమంలో జైపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉదయ్, గ్రామ పంచాయతి సిబ్బంది ఉన్నారు.

భీమారం మండలంలో..

ప్రకృతి వైపరీత్యాలను అరికట్టడం కోసం పర్యావరణాన్ని పరిరక్షించుకోవల్సిన అవసరం ఉందని భీమారం ఎంపీడీఓ రధా రాథోడ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల పరిషత్ ఆవరణలో మొక్కలు నాటారు. సిబ్బందితో కలిసి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ మహిళలు పాల్గొన్నారు.

లోకేశ్వరం : మండలంలోని పిప్రి గ్రామంలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ చెరువు కట్ట వద్ద మొక్కలు నాటారు. చెట్లను పెంచడం వలన వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, మొక్కలు నాటడం బాధ్యతని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సోలమన్ రాజ్, ఏపీఓ జగన్నాథ్, టీఏ మంజుల, ఎఫ్ఏ లోలం రమేష్, పంచాయతీ సెక్రటరీ రాజేందర్, కారోబర్ బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నార్నూర్ : మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణని ఏపీఓ జాదవ్ సురేష్ అన్నారు. బుదవారం మండలంలోని చోర్‌గావ్ గ్రామపంచాయతీలో పర్యావరణ దినోత్సవం సదర్భంగా ఉపాధిహామీ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. తాడిహత్నూర్ గ్రామ పంచాయతీలో ప్రతిమ ఫౌండేషన్ ఆర్గనైజర్ మానే సత్యవర్ధన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీఏ జాదవ్ సచిన్, ఫీల్డ్ అసిస్టెంట్లు జాదవ్ గణేష్, మోతిరాం, మాజీ ఉప సర్పంచ్ విష్ణు, ప్రతిమ ఫౌండేషన్ సభ్యులు బాపురావ్, కాంగ్రెస్ యూత్ సభ్యులు యురాజ్, లవకుష్, నర్సరీ నిర్వాహకులు దేవుజీ ఉన్నారు.

కడెం : పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని మండలంలోని అంగన్‌వాడి సూపర్‌వైజర్ షాహెనాజ్ పర్వీన్ అన్నారు. బుధవారం మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ గ్రామంలో గల అంగన్‌వాడీ టీచర్ ఎం. లక్ష్మీ, మిషన్ శక్తి సిబ్బందితో కలిసి ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో చెట్లను నాటుదం పర్యావరణాన్ని కపాడుదం అనే నినాదలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు సుమలత, పుష్పలత, గ్రామస్తులున్నారు.

సారంగాపూర్: మానవ మనగడకు చెట్లు ఎంతో కీలకమని సీసీఎఫ్ కె.శరవణనన్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భముగా మండలంలోని చించాలి(బి) గ్రామ సమీపాన గల గండి రామన్న హరితవనంలో, అడెల్లి పోచమ్మ సమీపంలో గల నందనవనంలో మొక్కలు నాటారు. విద్యార్థులకు చెట్ల ప్రాముఖ్యతను చిన్నతనం నుండే నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ ప్రసాద్ రెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్స్ వేణుగోపాల్, శ్రీదేవి, ఎఫ్‌బీఓలు వెన్నెల, మౌళి, రాజసింధు, స్వప్న పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఎంపీడీఓ కె సరోజ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మండలంలోని జెండా వెంకటాపూర్, హనుమంతుపల్లి, లక్ష్మీపూర్, వెంకట రావు పేట్ లలో జాతీయ ఉపాధిహామీ పథకం ద్వార చేపట్టిన అమృత్ సరోవర్ చెరువుల పూడికతీత పనుల వద్ద రైతులు, ఉపాధికూలీలుతో ఏర్పాటు సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఒక్కొక్క నీటి బొట్టును ఒడిసి పట్టి చెరువుల్లో, కుంటల్లోకి మళ్లించాలని అన్నారు. భూతాపాన్ని తగ్గించి వర్షం కురువాలంటే విరివిగా మొక్కలు నాటాలని వాటి సంరక్షణ కూడ చేపట్టాలన్నారు. అనంతరం రైతులు, ఉపాధి కూలీలతో ప్రతిజ్ఞచేయించారు. ఈకార్యక్రమంలో ఏపీఓ వెంకటరమణ, ఈసీ స్వామి, సాంకేతిక సహాయకులు బూసిరాజు రాజన్న, షేర్ల శైలజ, కంచి కైవల్య, పంచాయతీ కార్యదర్శులు పూదరి నరేందర్, వంశీకృష్ణ, శ్రవణ్, ఫీల్డ్ అసిస్టెంట్స్ ముంజమ్, మురళి, శ్రీధర్, వెంకటేష్, సతీష్ పాల్గొన్నారు.

నస్పూర్ : పర్యావరణ పరిరక్షణతోనే సకల ప్రాణుల మనుగడ అని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలో ఆర్కే-8 డిస్పెన్సరీలో పర్యావరణ ప్రతిజ్ఞ చేసి, చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం సందేశాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పర్యావరణ పరిస్థితి పైనే మానవ జాతి మనుగడ ఆధారపడి ఉంటుందని, అందుకే ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని రక్షించడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం పురుషోత్తమ రెడ్డి, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు కె. వెంకటేశ్వర్ రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎంలు చిరంజీవులు, అరవింద్ రావు, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ హనుమాన్ గౌడ్ పాల్గొన్నారు.

ఆర్కే-6 గనిలో..

పర్యావరణాన్ని రక్షించుట కొరకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆర్కే-6 గని మేనేజర్ తిరుపతి అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేశారు. ఆర్కే-6 గని పరిసర ప్రాంతంలోని కాలనీలో ర్యాలి నిర్వహించి ప్లాస్టిక్ వాడొద్దని నినాదాలు చేస్తూ జ్యూట్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమములో రక్షణాధికారి కాదసి శ్రీనివాస్, వెంటిలేషన్ ఆఫీసర్ రాం నర్సయ్య, డిప్యూటి మేనేజర్ మర్రి కొమురయ్య పాల్గొన్నారు.

మందమర్రి : టిష్యు వాడకాన్ని సాధ్యమైనంత తగ్గించాలని మందమర్రి ఏరియా జీఎం మనోహర్ సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను జీఎం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏరియా జనరల్ మేనేజర్ ఏ మనోహర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జూన్ 5వ తేదిన జరుపుకుంటామని, మన భూమిని సంరక్షించుకోవడానికి అవసరాలను గుర్తు చేస్తుందన్నారు. అనంతరం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞను జీఎం కార్యాలయ సిబ్బందితో చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం రాజేశ్వర్ రెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, సీఎంఓఏఐ అధ్యక్షుడు రమేష్, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ ప్రభాకర్, పర్సనల్ మేనేజర్ ఎస్ఎస్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

జన్నారం : పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఇంధన్‌పల్లి ఎఫ్ఆర్ఓ ఆఫీస్ ఉద్దీన్, తాళ్లపేట ఎఫ్ఆర్ఓ సుష్మారావు అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని, కవ్వాల్ టైగర్ జోన్ హాలో నీ తాళ్ల పేట రేంజ్ పరిధిలోని మహమ్మదాబాద్, రోటిగూడ, తపాలాపూర్, సింగరాయపేట గ్రామాల్లో అటవీ అధికారులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అలాగే ఇంధన్‌పల్లి రేంజ్ పరిధిలోని, నిర్మల్ ఆదిలాబాద్ ఎక్స్ రోడ్ వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరిపారేశారు. పర్యావరణాన్ని మనం రక్షిస్తేనే అది మనల్ని రక్షిస్తుంది అన్నారు. వాతావరణం సమతుల్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వృక్షాలుగా తయారు చేయాలన్నారు. మొక్కలే మానవ మనుగడకు జీవనాధారం అన్నారు. కార్యక్రమంలో తాళ్లపేట డీఆర్ఓ ప్రమోద్ కుమార్, ఎఫ్ఎస్ఓలు గోపికృష్ణ, ఎఫ్‌బీఓలు సాగర్, లాల్ భాయ్, రహీముద్దీన్, మహ్మదాబాద్ సర్పంచ్ చునార్కర్ లక్ష్మణ్, జన్నారం ఎంపీటీసీ మమ్మద్ రియాజుద్దీన్ పాల్గొన్నారు.

నిర్మల్ : పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.అజయ్ కుమార్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కొండాపూర్‌లోని బాలసదనం, అంగన్వాడీ కేంద్రాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ ప్రాముఖ్యత వివరిస్తూ చెట్లు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో ప్రపంచ వ్యాప్తంగా పరిశ్రమలు ఎక్కువగా స్థాపించడం వల్ల పర్యావరణ సమతుల్యత లోపించి అనేక రకాలైన వ్యాధులకు గురవుతున్నారని అన్నారు. ఓజోన్ పొర పరిరక్షణ కోసం పచ్చని చెట్లను పెంచాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఏ. నాగమణి, ఏసిడిపిఓ నాగలక్ష్మి, సూపర్వైజర్ మంగళ, బాలసదనం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఎం.కవిత, సుమలత మధుసూదన్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి దేవి మురళి, న్యాయవాదులు రాజలింగం, లింగాగౌడ్, నరేందర్, జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది ఎస్.రాజు, శ్రీనివాస్, నరేందర్, లక్ష్మణ్, మమత, శైలజ, కరుణశ్రీ, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ నల్ల గంగాధర్, సుప్రియ, పద్మ శ్రీదేవి పలువురు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సారంగాపూర్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని డిపిఓ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని ఆలూర్ గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని సూచించారు. పచ్చదనం పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని రక్షించాలని తెలిపారు. అనంతరం చించోలి, జామ్ గ్రామాల్లో పారిశుధ్య పనులను, నర్సరీలను పరిశీలించారు. వర్షాలు కురిసిన వెంటనే మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని పంచాయతీ అధికారులకు, ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో లక్ష్మీకాంతారావు, ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఏపీవో లక్ష్మారెడ్డి, ఉపాధి హామీ టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు పాల్గొన్నారు.



జైపూర్



సారంగాపూర్



మందమర్రి



జన్నారం